



చర్చ.. రచ్చ

రామవరంలో నల్లమిల్లిని అడ్డుకుంటున్న పోలీసులు.. తర్వాత వాహనంలో తరలింపు (కింద)

- అనపర్తిలో ఎమ్మెల్యే అవినీతిపై 'బహిరంగ చర్చ' రభస
- చర్చ జరగకుండానే ఇరు గ్రామాల్లో టీడీపీ, వైసీపీ బలప్రదర్శన
- మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లిని అడ్డుకున్న పోలీసులు, తోపులాట
- మూడున్నర గంటలపాటు పోలీసుల హైడ్రామా



అనపర్తి ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి చేసిన రూ.500 కోట్ల అవినీతి విషయమై బహిరంగ చర్చ కోసం టీడీపీ పట్టుబట్టడం, దానికి వైసీపీ ప్రతి సవాళ్లకు దిగడంతో అనపర్తి రాజకీయం వేడెక్కింది. ఈ క్రమంలో స్థానిక వైసీపీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అవినీతిపై టీడీపీ మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తొమ్మిది అంశాలతో కరపత్రం ముద్రించి పంపిణీ చేయడంతో ఇరు పార్టీల మధ్య మాటల యుద్ధం జరుగుతోంది. ఈ నేపథ్యంలో మార్చి 1న ఉదయం 11 గంటలకు ఎమ్మెల్యే ఇంటికి వెళ్లి, ఆయన అవినీతిపై బహిరంగ చర్చకు తాను సిద్ధంగా ఉంటానని మాజీ ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి సవాల్ చేయడంతో అనపర్తిలో టెన్షన్ నెలకొంది. శుక్రవారం ఉదయం అటు అనపర్తిలో ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, మండలంలోని తన స్వగ్రామం రామవరంలో మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డిలు బలప్రదర్శనతో సిద్ధంకావడంతో పోలీసులు రామకృష్ణారెడ్డిని అనపర్తికి వెళ్లకుండా అడ్డుకున్నారు. దీంతో పోలీసుల తీరుకు నిరసనగా నల్లమిల్లి రోడ్డుపై బైఠాయించడంతో పోలీసులకు, టీడీపీ శ్రేణులకు మధ్య తోపులాట జరి గింది. చివరకు పోలీసులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డిని అదుపులోకి తీసుకుని పోలీసు వాహనంలో తరలించి మూడున్నర గంటలపాటు నల్లమిల్లిని పోలీసులు రోడ్లపైనే తమ వాహనంలో తిప్పి చివరకు ఇంటి వద్ద వదిలారు. - 6లో



ఉల్లిపాయల
ధరలకు రెక్కలు!

- విదేశాలకు ఎగుమతులతో దేశీయ మార్కెట్లపై ప్రభావం
- కూరగాయల ధరలు కూడా పైపైకి
- ధరలపై పెళ్లిళ్లు, ఫంక్షన్ల ప్రభావం

రాజమహేంద్రవరంఅర్బన్, మార్చి1: ఉల్లిపాయల ధరలకు మళ్లీ రెక్కలొస్తున్నాయి. నిన్నమొన్నటి వరకూ ఉల్లి ధరలు కాస్త తగ్గినట్టు కనిపించినా అది ఎంతోకాలం నిలవలేదు. మహారాష్ట్ర నుంచి కొత్త ఉల్లిపాయలు ఒకేసారి మార్కెట్లను ముంచెత్తడం, వివిధ రకాల నాణ్యతలు కలిగిన ఉల్లిపాయలు అందుబాటులోకి రావడంతో సామాన్యులు, మధ్యతరగతి వర్గాలు తమకు నచ్చిన క్వాలిటీని ఎంపిక చేసుకునేవారు. ఆటోల్లో ఇళ్ల దగ్గరకు తెచ్చి మరీ ఏడు కిలోలు రూ.100కు కూడా విక్రయించారు. రైతుబజార్లు, బహిరంగ చిల్లర మార్కెట్లలోనూ ధర కాస్త తక్కువగానే ఉండేది. కానీ ఇప్పుడు సీన్ మారుతోంది. ఇటీవల కేంద్ర ప్రభుత్వం ఉల్లి ఎగుమతులపై తాత్కాలికంగా నిషేధం ఎత్తివేయడంతో మహారాష్ట్ర నుంచి ఇతర దేశాలకు భారీగా ఎగుమతులు వెళ్లిపోతున్నాయి. ఫలితంగా దేశీయ మార్కెట్లోకి ఉల్లిలోడులు తక్కువగా వస్తున్నాయని, డిమాండ్‌కు అనుగుణంగా సరఫరా లేకపోవడంతో కొరత ఏర్పడి ధరల పెరుగుదలకు కారణంగా కనిపిస్తోందని ఇక్కడి వ్యాపారులు చెబుతున్నారు. మరోపక్క కూరగాయల ధరల్లోనూ పెరుగుదల నమోదవుతోంది. మాఘమాసంలో పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాలు పెద్దసంఖ్యలో జరుగుతుండడంతో కూరగాయల వినియోగం భారీగా పెరిగింది. దీంతో వ్యాపారులు ధరలు పెంచేశారు. అలాగే ఉష్ణోగ్రతల్లో వస్తున్న మార్పుల ప్రభావం కూరగాయల దిగుబడులపై పడుతోంది. దీంతో కూరగాయల ధరల్లో కొంత పెరుగుదల కనిపిస్తోంది. ముఖ్యంగా గత వారం రోజులుగా ఉల్లి ధరల్లో పెరుగుదల కనిపిస్తోంది. హోల్‌సేల్ మార్కెట్లో మంచి నాణ్యత కల్గిన ఉల్లిపాయలు కిలో రూ.26-రూ.28 ధర ఉంటే, ఇదే రకాన్ని బహిరంగ మార్కెట్లో రిటైల్ వ్యాపారులు రూ.30 నుంచి రూ.35ల వరకూ విక్రయిస్తున్నారు. రైతుబజార్లలో మొన్నటివరకూ కిలో రూ.20 ఉన్న ధర ఇప్పుడు రూ.24కు చేరింది. ఆటోల్లో ఇళ్ల దగ్గరకే తెచ్చి విక్రయించేవారు కూడా రూ.100కు ఐదు కిలోలు మించి ఇవ్వడంలేదు. క్వాలిటీ తక్కువగా ఉండే రకాలు మార్కెట్లోకి రాకపోవడం, మంచి రకాలు, నిల్వపాయలు ఎక్కువ రేటులో ఉండడంతో వీధుల్లో విక్రయించే చిల్లర వ్యాపారులు ఉల్లిపాయల జోలికి వెళ్లడం లేదు.

కూరగాయలదీ అదే దారి..

ఉల్లిపాయల బాటలోనే కూరగాయల ధరల్లోనూ పెరుగుదల కనిపిస్తోంది. ఒక్క టమోటా మినహా మిగిలిన అన్ని రకాల కూరగాయల ధరలు పెరిగాయి. బహిరంగ చిల్లర మార్కెట్లో దొమ్మేరు వంకాయలు కిలో రూ.80 వరకూ అమ్ముతున్నారు. బెండకాయలు రూ.50, పచ్చిమిర్చి రూ.60, కాకరకాయలు రూ.50, బీరకాయలు రూ.40, చిక్కుళ్లు రూ.80 వరకూ అమ్ముతున్నారు. రైతుబజార్లలో ధరలు పరిశీలిస్తే దొమ్మేరు వంకాయలు కిలో రూ.54, గులాబీ రకం రూ.44, తెలుపు రూ.38 ఉంది. రెండు వారాల వ్యవధిలోనే కిలోకు రూ.10 నుంచి రూ.15 వరకూ ధరలు పెరిగాయి. కాలీఫ్లవర్ పువ్వు రూ.25కు విక్రయిస్తున్నారు. ఇది రూ.12 నుంచి 15లకు దొరికేది. బెండకాయలు రూ.32, పచ్చిమిర్చి రూ.34, కాకరకాయ రూ.38, చిక్కుళ్లు రూ.54, చేమదుంపలు రూ.50, బీన్స్ రూ.60, ఆనబకాయ రూ.16.. ఇలా అన్ని రకాల కూరగాయల్లోనూ పెరుగుదల కనిపిస్తోంది. రైతుబజార్లతో పోల్చితే బహిరంగ మార్కెట్లలో ధరలు మరింత ఎక్కువగానే ఉంటాయి.

ధరలు మరింత పెరిగే అవకాశం

రాబోయే రోజుల్లో ఉల్లిపాయలు, కూరగాయల ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు చెబుతున్నారు. ఇతర దేశాలకు ఉల్లి ఎగుమతులపై మళ్లీ నిషేధం విధించినా ఉల్లిపాయల ధరలు ఇప్పట్లో తగ్గకపోవచ్చనే అంచనా వేస్తున్నారు. ఉల్లిపాయలు పాతబడితే వాటి నాణ్యత పెరుగుతుంది. నిల్వకు ఆగుతాయి. ఇలాంటి రకాలన్నీ కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేస్తారు. మంచి రేటు వచ్చాక బయటకు తీస్తారు. ఎగుమతులపై నిషేధం లేకపోతే క్వాలిటీ ఉల్లిపాయలను మంచిరేటుకు ఇతర దేశాలకు ఎగుమతి చేస్తారని, దేశీయమార్కెట్లో కొరత ఏర్పడి ధరలు పెరుగుతాయని హోల్‌సేల్ వ్యాపారులు చెబుతున్నారు. అలాగే, రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగితే ఆ ప్రభావం కూరగాయల సాగుపై పడుతుంది. దిగుబడులు లేకపోతే ఇతర ప్రాంతాల నుంచి కూరగాయలను తీసుకురావాల్సి ఉంటుంది. ఫలితంగా ధరలు మరింత పెరుగుతాయని కూరగాయల వ్యాపారులు చెబుతున్నారు. అటు ఉల్లిపాయలు, ఇటు కూరగాయలు సామాన్యులపై ధరల పంజా విసరబోతున్నాయనే చెప్పాలి.

రాజమహేంద్రవరం లోక్‌సభ ఉమ్మడి
అభ్యర్థి ఎవరో

- టీడీపీనా.. బీజేపీ కోటానా అంటూ చర్చ
- పలువురు ఆశావహుల ఎదురుచూపులు
- టీడీపీకి లోకసభ బలమైన నియోజకవర్గం
- రాష్ట్ర విభజన తర్వాత అత్యధిక మెజార్టీ సాధించిన ఘనత మురళీమోహన్‌దే
- 2014లో టీడీపీకి 14.29% ఓట్ల మెజారిటీ
- 2019లో వైసీపీకి 9.73% ఓట్ల మెజారిటీ
- గతంలో ఓట్ల చీలిక కారణంగానే నష్టం
- వైసీపీ నుంచి ఇప్పటికే డాక్టర్ గూడూరి
- ఉమ్మడి అభ్యర్థి కోసం సర్వత్రా ఆసక్తి

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో రాజమహేంద్రవరం లోక్‌సభ స్థానం నుంచి టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థి ఎవరనేది చర్చనీయాంశమైంది. టీడీపీ అభ్యర్థినే నిలబెడతారా, బీజేపీతో పొత్తు కుదిరితే ఆ పార్టీ అభ్యర్థిని నిలబెడతారా అనేది ప్రధాన చర్చ సాగుతోంది. రాజమహేంద్రవరం లోక్‌సభలో ద్విముఖ పోటీ మాత్రమే జరిగే అవకాశం ఉంది. ప్రధాన పార్టీలైన టీడీపీ, జనసేన ఒకవైపు, వైసీపీ మరొకవైపు పోటీచేయనుంది. బీజేపీ కూడా టీడీపీ-జనసేన పొత్తులో భాగస్వామ్యం కానున్నట్టు ప్రచారం జరుగుతోంది. అది ఖరారైతే ఈ మూడు పార్టీలు కలసి ఉమ్మడి అభ్యర్థిని బరిలో పెడతాయి. ఇదే జరిగితే ఉమ్మడి అభ్యర్థి బలం బాగా పెరిగినట్టే. వైసీపీ ఎంపీ మార్గాని భరత్‌ను సిటీ సమన్వయకర్తగా నియమించి, సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌ను లోక్‌సభ కోఆర్డినేటర్‌గా వైసీపీ అధిష్ఠానం నియమించిన సంగతి తెలిసిందే. ఆయనే లోక్‌సభ అభ్యర్థిగా ప్రచారం చేసుకుంటున్నారు. కానీ సమన్వయకర్తలంతా అభ్యర్థులు కాదని వైసీపీ ముఖ్యనేతలు చేస్తున్న ప్రకటనలతో కాస్త అయోమయం నెలకొంది. కానీ డాక్టర్ గూడూరి శ్రీనివాసే వైసీపీ లోక్‌సభ అభ్యర్థి అని పార్టీ వర్గాలు ప్రచారం చేసుకుంటున్నాయి. ఇక ఉమ్మడి అభ్యర్థి ఎవరనేది ఇంకా తేలలేదు. టీడీపీ అభ్యర్థినే ఉమ్మడి అభ్యర్థిగా పోటీపెడితే గుడా మాజీ చైర్మన్, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ తనకు అవకాశం ఇవ్వాలని ఇప్పటికే టీడీపీ అధినేత చంద్రబాబుకు లేఖ రాసిన సంగతి తెలిసిందే. ఆయన లోక్‌సభ టిక్కెట్ ఆశిస్తుండగా, రాజానగరం ఎమ్మెల్యే టిక్కెట్ ఆశించిన రాజానగరం టీడీపీ ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణ కూడా టిక్కెట్ ఆశిస్తున్నారు. 2014లో ఆయన వైసీపీ తరపున ఎంపీగా పోటీచేసిన అనుభవం కూడా ఉంది. ఇంకా మాజీ ఎంపీ కంభంపాటి రామ్మోహన్, శిష్టా లోహిత్, పార్టీ సమన్వయకర్త వై.రవి వంటి వారు కూడా టిక్కెట్ ఆశిస్తున్నారు. బీజేపీతో టీడీపీ-జనసేనకు పొత్తుకుదిరితే బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురంధేశ్వరి ఇక్కడి నుంచి పోటీ చేస్తారనే వాదన కూడా ఉంది. ఈ వారంలోగానీ, రెండోవారంలోగానీ అభ్యర్థిని ఖరారు చేసే అవకాశం ఉంది. జిల్లాలో ఏడు అసెంబ్లీ నియోజవర్గాలు ఉన్నాయి. ఇంతవరకూ మూడు చోట్ల అభ్యర్థులను ఖరారుచేశారు. రాజమహేంద్రవరం సిటీకి ఆదిరెడ్డి వాసు, అనపర్తికి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అభ్యర్థిత్వాలను ఖరారుచేయగా, రాజానగరం నుంచి జనసేన నేత బత్తుల బలరామకృష్ణను ఖరారు చేసిన సంగతి తెలిసిందే. ఇక రాజమహేంద్రవరం రూరల్‌ను ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, నిడదవోలు నుంచి జనసేన నేత కందుల దుర్గేష్‌ను ఖరారు చేస్తారనే ప్రచారం జరుగుతోంది. గోపాలపురం నుంచి మద్దిపాటి వెంకట్రాజు అభ్యర్థిత్వం ఖరారైనట్టే. ఇక అధికారికంగా ప్రకటించడమే తరువాయి. కొవ్వూరులో ఇంకా అస్పష్టత కొనసాగుతోంది. వైసీపీలో రాజమహేంద్రవరం సిటీ నుంచి ఎంపీ మార్గాని భరత్, రూరల్ నుంచి మంత్రి చెల్లుబోయిన వేణు, కొవ్వూరు నుంచి గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, గోపాలపురం నుంచి మంత్రి తానేటి వనితలను సమన్వయకర్తలుగా నియమించిన సంగతి తెలిసిందే. మరో మూడు చోట్ల అంటే రాజానగరం, అనపర్తి, నిడదవోలులో సమన్వయకర్తల నియామకం జరగవలసి ఉంది. ప్రధాన పార్టీలన్నింటిలో అభ్యర్థులు ఖరారు కాని చోట్ల అటు ఆశావహుల్లోను, ఆయా పార్టీల కేడర్‌లోనూ పడుతున్నారు.

ఉమ్మడి అభ్యర్థిపైనే అందరి చూపు

రాజమహేంద్రవరం లోక్‌సభ స్థానం గోదావరికి అటూఇటూ ఉన్న ప్రాంతం. ఈ స్థానం టీడీపీకి కంచుకోట. పోల్ మేనేజ్‌మెంట్, వర్గాల సమీకరణ వ్యూహాత్మకంగా ఉంటే టీడీపీ నుంచి ఈ స్థానాన్ని ఎవరూ తన్నుకుపోలేనంత కేడర్ టీడీపీకి ఉంది. తెలుగుదేశం పార్టీ ఏర్పడిన తర్వాత 1984 నుంచి 2019 వరకూ జరిగిన పది లోక్‌సభ ఎన్నికలలో టీడీపీ మూడుసార్లు, బీజేపీ రెండుసార్లు, కాంగ్రెస్ నాలుగుసార్లు, వైసీపీ ఒకసారి గెలిచింది. కానీ గెలిచిన ప్రతీసారీ ఓట్ల శాతం పరిశీలించినా, మెజార్టీ శాతం పరిశీలించినా టీడీపీకే అధికంగా ఓట్లు తెచ్చుకోవడం గమనార్హం. రాష్ట్ర విభజన తర్వాత మొదటగా జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో రాజమహేంద్రవరం లోక్‌సభ స్థానం నుంచి ప్రముఖ సినీనటుడు మాగంటి మురళీమోహన్ ఘనవిజయం సాధించారు. అప్పట్లో 6,30,573 ఓట్లు అంటే 54.62 శాతం ఓట్లు సాధించారు. అంతకుముందు జరిగిన ఎన్నికలకంటే అదనంగా 19.72 శాతం సాధించారు. 2009 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి ఉండవల్లి అరుణకుమార్ చేతిలో కేవలం 2,147 ఓట్ల తేడాతో మురళీమోహన్ ఓడిపోయిన సంగతి తెలిసిందే. కానీ 2014లో జరిగిన ఎన్నికల్లో ఇంతవరకూ ఎవరికీ రానంత మెజారిటీ ఆయనకు వచ్చింది. ఏకంగా 1,67,434 ఓట్ల మెజారిటీ లభించింది. ఇది 14.29 శాతం మెజారిటీ. అప్పట్లో వైసీపీ తరపున పోటీ చేసిన బొడ్డు వెంకటరమణకు 4,63,139 ఓట్లు వచ్చాయి. అది 40.12 శాతం. కానీ 2019లో తెలుగుదేశం, జనసేన వేర్వేరుగా పోటీచేసి దెబ్బతిన్నాయి. టీడీపీ తరపున మాగంటి మురళీమోహన్ కోడలు మాగంటి రూప పోటీ చేసి 4,60,390 ఓట్లు అంటే 36.82 శాతం తెచ్చుకోగలిగారు. జనసేన అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే ఆకుల సత్యనారాయణ పోటీచేసి 1,55,807 ఓట్లు అంటే 12.46 శాతం సాధించారు. ఈ ఇద్దరి మధ్య ఓట్లు చీలిపోవడంతో వైసీపీ అభ్యర్థి మార్గాని భరత్ 5,82,024 ఓట్లు అంటే 46.55 శాతం ఓట్లు సాధించి, 1,21,634 ఓట్లు మెజార్టీ సాధించారు. ఇది 9.73 శాతం మెజార్టీ.. ఈసారి ఈ లెక్కలే కాక, అధికార పార్టీ మీద ఉన్న ప్రజల్లో వ్యతిరేకత, టీడీపీ, జనసేన ఐక్యత వల్ల ఉమ్మడి అభ్యర్థికే విజయావకాశాలు ఉంటాయని అంచనా వేస్తున్నారు.



రాజమహేంద్రవరం ఏకేసీ కాలేజీ వద్ద ఇంటర్ విద్యార్థుల సందడి





పరీక్ష సమయం దగ్గరపడడంతో పరుగులు తీస్తున్న విద్యార్థులు

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు ప్రారంభం

- మూడు జిల్లాలో 2,550 మంది విద్యార్థులు గైర్హాజరు
- తూర్పుగోదావరిలో జనరల్ 19,309 మంది, ఒకేషనల్ విభాగంలో 1851 మంది హాజరు
- పలుచోట్ల అసౌకర్యాలతో విద్యార్థుల ఇక్కట్లు
- సీలింగ్ ఫ్యాన్లు పనిచేయక ఎండ వేడిమికి మరిన్ని అవస్థలు

- 8లో

ఎన్నికల లెక్కింపు కేంద్రం పరిశీలన



నన్నయ వర్సిటీ ప్రాంగణంలో ముందస్తు ఎన్నికల ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

దివాన్‌చెరువు, మార్చి1: ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ప్రాంగణంలో రిసెప్షన్ కేంద్రాన్ని, అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా స్ట్రాంగ్‌రూమ్‌లు, లెక్కింపు కేంద్రాలను కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కె.మాధవీలత శుక్రవారం పరిశీలించారు. ఎస్పీ పి.జగదీష్, నియోజకవర్గాల ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, ఎన్నికల అధికారులతో కలసి కలెక్టర్ ముందస్తు ఏర్పాట్లను, రోడ్ మ్యాప్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ అనంతరం ఏడు నియోజకవర్గాలవారీగా బ్యాలెట్ యూనిట్లు అత్యంత భద్రత మధ్య నన్నయ విశ్వవిద్యాలయానికి తీసుకువచ్చి ఆయా నియోజకవర్గాలకు కేటాయించిన స్ట్రాంగ్‌రూమ్‌లకు చేర్చడం జరుగుతుందన్నారు. లెక్కింపు జరిపేరోజు దాకా ఏఏ పనులు చేపట్టాలనే అంశంపై రోడ్‌మ్యాప్ సిద్ధం చేసుకుని ట్రైల్ నిర్వహించాలని, రిసెప్షన్ కేంద్రం నుంచి స్ట్రాంగ్‌రూమ్‌కు అక్కడి నుంచి లెక్కింపు జరిపే రోజున నియోజకవర్గం లెక్కింపు కేంద్రానికి తదుపరి స్ట్రాంగ్‌రూమ్‌కు చేరేవరకూ తీసుకునే చర్యలపై నివేదిక అందజేయాలని ఆదేశించారు. నన్నయ ప్రాంగణంలో రిసెప్షన్ కేంద్రం, స్ట్రాంగ్ రూమ్‌లు, లెక్కింపు కేంద్రాలు, స్టాట్యూటరీ, నాన్ స్టాట్యూటరీ ఫార్మ్ భద్రపరచడం కోసం అవసరమైన అన్ని చర్యలు క్షేత్రస్థాయిలో పరిశీలించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. ఎస్పీ పి.జగదీష్ మాట్లాడుతూ మూడంచెల భద్రత ఏర్పాట్లు చేస్తున్నట్టు వివరించారు. కలెక్టర్ వెంట రాజమహేంద్రవరం రూరల్ ఆర్వో, జేసీ ఎన్.తేజ్ భరత్, రాజమహేంద్రవరం అర్బన్ ఆర్వో, నగరపాలక సంస్థ కమిషనర్ కె.దినేష్‌కుమార్, కొవ్వూరు ఆర్వో, సబ్‌కలెక్టర్ అశుతోష్‌శ్రీవాత్సవ్, డీఆర్వో జి.నరసింహులు, రాజానగరం ఆర్వో, రాజమహేంద్రవరం ఆర్డీవో ఏ.చైత్రవర్షిణి, ఓఎన్జీసీ ఎస్‌డీసీ కేఎల్ శివజ్యోతి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (గెయిల్), అనపర్తి ఆర్వో ఎం.మాధురి, పీఐపీ ఆర్‌ఎంసీ యూనిట్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, నిడదవోలు ఆర్వో ఆర్‌వీ రమణనాయక్, కేఆర్ఆర్‌సీ ఎస్‌డీసీ ఆర్.కృష్ణనాయక్, ఎస్‌బీ డీఎస్పీ డి.ప్రభాకర్ పాల్గొన్నారు.

మార్గదర్శకాల ప్రకారం ఎన్నికల శిక్షణ పూర్తి

రాజమహేంద్రవరం సిటీ/రూరల్, మార్చి1: ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం వివిధ బృందాలకు శిక్షణ కార్యక్రమం పూర్తిచేశామని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ కె.మాధవీలత తెలిపారు. శుక్రవారం సాయంత్రం వెలగపూడి నుంచి రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్‌కుమార్‌మీనా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న జిల్లా కలెక్టర్లతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌లో మన జిల్లా నుంచి కలెక్టర్ కే మాధవీలత ఎన్నికల ఏర్పాట్లను వివరించారు.



విద్యార్థులు గల్లంతైన హాస్టల్

ఎస్సీ హాస్టళ్ల విద్యార్థుల
భద్రత గాలికి..

- పారిపోతున్న విద్యార్థులు, పది రోజుల్లో ముగ్గురు అదృశ్యం
- పోలీసులకు ఫిర్యాదు చేసి చేతులు దులిపేసుకుంటున్న వైనం
- సాంఘిక సంక్షేమశాఖ అధికారులు, వార్డెన్ల తీరుపై విమర్శలు

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి1: ఎస్సీ హాస్టళ్లలో చదువుతున్న విద్యార్థుల భద్రత విషయంలో జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అధికారులు తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఎక్కడెక్కడి నుంచో వచ్చి తల్లిదండ్రులకు దూరంగా హాస్టళ్లలో ఉంటూ చదువుకుంటున్న విద్యార్థుల బాగోగుల విషయంలో హాస్టల్ వెల్ఫేర్ అధికారులు (వార్డెన్లు) చాలా ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారంటూ విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పది రోజుల కిందట రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల సమీపంలోని సాంఘిక సంక్షేమబాలుర వసతిగృహం నెంబర్-1 హాస్టల్ నుంచి 7వ తరగతి చదువుతున్న విద్యార్థి ఒకరు పారిపోగా, రెండు రోజుల కిందట ఇదే హాస్టల్‌లో 9వ తరగతి చదువుతున్న మరో ఇద్దరు విద్యార్థులు కూడా పారిపోవడం ఆందోళన కల్గిస్తోంది. అయితే 9వ తరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థులు శుక్రవారం రాజమహేంద్రవరం రైల్వేస్టేషన్‌లో పోలీసులకు దొరకడంతో వారిని తీసుకొచ్చి వారి తల్లిదండ్రులకు అప్పగించారు. వీరిద్దరూ రైలెక్కి సికింద్రాబాద్ వెళ్లి తిరిగి వచ్చేసినట్టు ప్రచారం జరుగుతోంది. పెద్దాపురంనకు చెందిన 7వ తరగతి విద్యార్థి ఆచూకీ దొరకలేదు. ఒకే హాస్టల్‌లో చదువుతున్న ముగ్గురు విద్యార్థులు స్కూల్ నుంచి పారిపోవడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఇదిలా ఉంటే, మూడు నెలల కిందట గణేష్‌చౌక్ సమీపంలోని ఎస్సీ బాలికల హాస్టల్‌లో చదువుతున్న ఒక బాలిక మూడు రోజులపాటు అదృశ్యమైంది. పోలీసులు దీనిపై తమదైన శైలిలో గట్టిగా దృష్టిపెట్టడంతో కుటుంబ వివాదాల నేపథ్యంలో ఆ బాలికను తండ్రే స్కూల్ నుంచి ఇంటికి తీసుకెళ్లినట్టు తేలింది. ఇలాంటి సంఘటనలు చోటుచేసుకున్నప్పుడు బాలికలకు వైద్యపరీక్షలు చేయించాలనే నిబంధన ఉన్నా హాస్టల్ అధికారులు దాన్ని నిర్లక్ష్యంగా వదిలేశారని తెలిసింది. అలాగే రెండువారాల కిందట బీసీ బాలుర హాస్టల్‌లో 10వ తరగతి చదివే విద్యార్థి పారిపోయాడు. ఇతని ఆచూకీ కూడా దొరకలేదు. హాస్టళ్లలో చదువుకుంటున్న విద్యార్థినీవిద్యార్థుల భద్రతతోపాటు వారి బాగోగులను హాస్టల్ వెల్ఫేర్ అధికారులు (వార్డెన్లు) పూర్తిస్థాయిలో పట్టించుకోవాల్సి ఉంటుంది. ప్రధానంగా బాలికల హాస్టల్స్‌లోని విద్యార్థినిలపై మరింత శ్రద్ధ పెట్టాల్సి ఉన్నా అలా జరగడం లేదని చెబుతున్నారు. అమ్మాయిల హాస్టళ్లకు చెందిన కొందరు మహిళా వార్డెన్ల పనితీరు, ఇతర విషయాలపై జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెళ్లినా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం సాంఘిక సంక్షేమశాఖ ఉద్యోగుల్లో చర్చనీయాంశంగా మారింది. ఇక టెన్త్ వరకూ విద్యార్థులను ఉదయం హాస్టల్ నుంచి స్కూల్ వరకూ తీసుకెళ్లడం, మళ్లీ సాయంత్రం స్కూల్ నుంచి హాస్టల్ వరకూ తీసుకురావడం చేయాల్సి ఉంటుంది. ఇక్కడి ఎస్సీ హాస్టళ్లలో అలాంటి పరిస్థితులు కనిపించడంలేదనే చెప్పాలి. జిల్లా సాంఘిక సంక్షేమాధికారి కార్యాలయం రాజమహేంద్రవరంలోనే ఉంది. రాజానగరం ఏఎస్‌డబ్ల్యువోగా పనిచేస్తున్న సందీప్‌కు డీఎస్‌డబ్ల్యువో ఎఫ్ఏసీగా బాధ్యతలు అప్పగించి నియమించారు. రెగ్యులర్ డీఎస్‌డబ్ల్యువో కాకపోవడంతో ఆయన జిల్లాలోని హాస్టళ్లపై పెద్దగా దృష్టి పెట్టడంలేదని చెబుతున్నారు. రాజమహేంద్రవరంలోనే ఏఎస్‌డబ్ల్యువో ఉన్నా హాస్టళ్లను సందర్శించడం తక్కువే అని చెబుతుంటారు. ఆయా విషయాలపై వివరణ కోరగా హాస్టల్స్‌లో చదువుకుంటున్న విద్యార్థులు స్కూల్ నుంచి పారిపోతే తమకేంటి సంబంధం అంటూ రాజమహేంద్రవరం ఏఎస్‌డబ్ల్యువో ప్రసాద్ పేర్కొన్నారు. పిల్లలకు హాస్టల్‌లో ఉండడం ఇష్టంలేదని, చదవమన్నా తప్పులా ఉంటున్నదని అన్నారు. హాస్టల్ పిల్లలకు తాము ఏమీ చెప్పలేకపోతున్నామని వ్యాఖ్యానించారు. స్కూల్ నుంచి ఎలాంటి అజమాయిషీ లేదన్నారు. పారిపోయిన పిల్లవాడి కోసం వెతుకుతున్నాం అని తెలిపారు.

సౌత్ జోన్ పరిధిలో సెక్షన్ 30 పొడిగింపు

రాజమహేంద్రవరం, మార్చి 1(ఆంధ్రజ్యోతి): సౌత్ జోన్ పరిధిలోని టూటౌన్, ధవళేశ్వరం, కడియం పోలీస్‌స్టేషన్ల పరిధిలో పోలీస్ చట్టంలోని సెక్షన్ 30 విధించిన విషయం తెలిసిందే. అయితే ఈ విధింపును ఈనెల 31 వరకూ పొడిగిస్తున్నట్టు డీఎస్పీ ఎం.అంబికాప్రసాద్ తెలిపారు. తమ నుంచి ముందస్తుగా అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, ఊరేగింపులు వంటివి జరపడానికి వీల్లేదని ఆయన పేర్కొన్నారు. ఉత్తర్వులను ఉల్లంఘిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని డీఎస్పీ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

విద్యా దీవెన రూ.24 కోట్లు జమ : కలెక్టర్ మాధవీలత

రాజమహేంద్రవరం, మార్చి 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలో విద్యాదీవెన పథకం కింద 2023-24 ఏడాదికి సంబంధించి 31,926 మంది విద్యార్థుల నిమిత్తం 28,730 మంది తల్లుల బ్యాంకు ఖాతాలో రూ.24,09,39,718 మొదటి విడతగా జమ చేశామని జిల్లా కలెక్టర్ డా.కే.మాధవీలత ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

చర్చ..రచ్చ



నల్లమిల్లి రామకృష్ణారెడ్డి వాహనాన్ని చుట్టుముట్టిన పోలీసులు


ఇంటికి వచ్చిన పోలీసులను ప్రశ్నిస్తున్న నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

అనపర్తిలో 'బహిరంగ చర్చ' రచ్చరచ్చ

మాజీ ఎమ్మెల్యే చర్చ పిలుపునకు స్పందించని ఎమ్మెల్యే

బయటకు వెళ్లకుండా నల్లమిల్లిని అడ్డుకున్న పోలీసులు

పోలీసులకు టీడీపీ శ్రేణులకు మధ్య తోపులాట

అనపర్తి, మార్చి 1: అనపర్తి ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ఐదేళ్లలో చేసిన రూ.500 కోట్ల అవినీతిపై చర్చకు సిద్ధమని మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి చేసిన ప్రకటన, తదనంతర పరిణామాలు తీవ్ర ఉద్రిక్త పరిస్థితులకు దారితీశాయి. ఒక విధంగా చెప్పాలంటే ఈ బహిరంగ చర్చ అంశం రచ్చరచ్చగా మారింది. ఇది శుక్రవారం అనపర్తిలో ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి వర్గీయులు, రామవరంలో రామకృష్ణారెడ్డి వర్గీయుల బలప్రదర్శనగా సాగింది. ఇటీవల నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి అవినీతిపై ముద్రించిన కరపత్రం సూర్యనారాయణకు చెందిన గంగిరెడ్డి నర్సింగ్ హోంలోని సిబ్బందికి స్వయంగా అందజేశారు. ఇది వివాదాస్పదంగా మారింది. తాను లేనపుడు ఆసుపత్రికి రావడం కాదని.. దమ్ముంటే ముందుగా సమయం చెప్పి రావా లంటూ ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలతో వివాదం మరింత పెరిగింది. దీనికి స్పందించిన నల్లమిల్లి మార్చి 1వ తేదీ ఉదయం 11 గంటలకు ఎమ్మెల్యే ఇంటికి అవినీతిపై చర్చించేందుకు వస్తానని ప్రకటించారు. దీంతో బహిరంగ చర్చ అంశం తెరమీదకు వచ్చింది. నల్లమిల్లి చేసిన ప్రకటనకు నాలుగు రోజులు గడిచినా ఎమ్మెల్యే నుంచి ఎటువంటి స్పందన లేదు. అయినప్పటికీ నల్లమిల్లి రామకృష్ణారెడ్డి బహిరంగ చర్చకు వచ్చేందుకు సిద్ధపడడంతో గురువారం రాత్రి నుంచే పోలీసు బలగాలు నల్లమిల్లి ఇంటికి చేరుకున్నాయి. శుక్రవారం ఉదయం అనపర్తిలో ఎమ్మెల్యే నివాసానికి వైసీపీ శ్రేణులు, రామవరంలో నల్లమిల్లి నివాసానికి టీడీపీ శ్రేణులు పెద్ద సంఖ్యలో చేరుకున్నాయి. 10:30 ప్రాంతంలో అనపర్తిలో ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి తన అనుచరులతో ర్యాలీ నిర్వహిస్తున్నారని తెలుసుకున్న రామకృష్ణారెడ్డి అనపర్తి వెళ్లేందుకు పయనం కావడంతో పోలీసులు ఇంటిలోకి చొరబడి ఆయనను గృహ నిర్బంధం చేసేందుకు ప్రయత్నించారు. చివరకు పోలీసులను దాటుకుని అనపర్తి-పెదపర్తి రోడ్డుపైకి చేరుకున్న నల్లమిల్లిని పోలీసులు అడ్డు కున్నారు. వాహనంపై వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అక్కడి నుంచి కదలనివ్వకపోవడంతో ఆయన వాహనం దిగి రోడ్డుపై బైఠాయించి సుమారు గంటన్నర పాటు నిరసన చేపట్టారు. ఈ క్రమంలో ఆయనను పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీసు వాహనం ఎక్కించుకుని అక్కడి నుంచి తరలించే ప్రయత్నం చేశారు. దీంతో పోలీసులకు, టీడీపీ శ్రేణులకు మధ్య తోపులాట జరిగింది. కొందరు నాయకులు, కార్యకర్తలు రోడ్డుపై పడుకుని నిరసన తెలపడంతో పోలీసులు వారిని వాహ నానికి అడ్డు తొలగించి నల్లమిల్లిని అక్కడి నుంచి తరలించారు. నల్లమిల్లిని తరలిస్తున్న పోలీసు వాహనాన్ని టీడీపీ నాయకులకు చెం దిన కార్లు, బైకులు వెంబడించాయి. రామవరం నుంచి కొవ్వూరు తరలించడం ఆఖరికి ఏ పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లకుండా రోడ్లపైనే తిప్పడంతో కొవ్వూరు టోల్‌ప్లాజా వద్ద టీడీపీ నాయకులు పోలీసు వాహనాన్ని అడ్డుకుని ఆందోళన చేయడంతో మూడున్నర గంటల హైడ్రామా తర్వాత నల్లమిల్లిని అదే వాహనంలో ఇంటికి తీసుకొచ్చి వదిలిపెట్టారు. ఇంటికి చేరుకున్న నల్లమిల్లికి ఆయన సతీమణి మహాలక్ష్మి హారతిచ్చారు.

బహిరంగ చర్చ చేసే ధైర్యం లేకే..

అవినీతిపై తన ప్రశ్నలకు సమాధానం చెప్పలేకే ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి పోలీసులను అడ్డుపెట్టుకుని పలాయనం చిత్తగించారని రామకృష్ణారెడ్డి విమర్శించారు. పదేళ్లుగా తనపై అవే ఆరోపణలు చేస్తున్నారని, సదరు ఆరోపణలపై విజిలెన్స్ ఎంక్వయిరీ చేయించారని, నేటికీ నివేదిక బయటకు ఎందుకు రాలేదన్నారు. అవినీతి జరిగి ఉంటే అధికారంలో ఉండి కూడా తనను ఎందుకు వదలిపెట్టారని ఆయన ప్రశ్నించారు. ఎమ్మెల్యే చేసిన అవినీతిని ఆధారాలతో సహా నిరూపించేందుకు సిద్ధమని చెప్పినా ఆయన చర్చకు ఎందుకు రావడంలేదో ప్రజలకు అర్థమయిందన్నారు. రాష్ట్రంలో 175 మంది ఎమ్మెల్యేల్లో అవినీతికి పాల్పడని ఎమ్మెల్యే తానేనని చెప్పుకునే సూర్యనారాయణరెడ్డికి నీతిపరుడని నిరూపించుకునే చర్చలో పాల్గొనడానికి భయమెందుకని ఎద్దేవా చేశారు.

నల్లమిల్లి అనుచరుల నిరసన



వైసీపీ నాయకుల ర్యాలీ

ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి వైసీపీ నాయకులు, కార్యకర్తలతో స్థానిక గంగి రెడ్డి నర్సింగ్ హోమ్ నుంచి దేవీచౌక్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే అవినీతిపై ముందు చర్చ జర గాలని డిమాండ్ చేశారు. తాను అవి నీతికి పాల్పడినట్టు రుజువు చేయ గలిగితే రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటానని అన్నారు.

కొవ్వూరులో ఉద్రిక్తత

కొవ్వూరుకు రామకృష్ణారెడ్డి.. తెలుగు తమ్ముళ్ల ఆందోళన

గామన్‌బ్రిడ్జి టోల్‌గేట్ వద్ద పోలీసు వాహనాన్ని అడ్డుకున్న నాయకులు

ఎందుకు తిప్పుతున్నారని డీఎస్పీని నిలదీసిన నేతలు

కొవ్వూరు, మార్చి 1 : అనపర్తి సంఘటన కొవ్వూరును కూడా తాకింది. అవినీతిపై గళమెత్తిన టీడీపీ నాయకులను అక్రమ అరెస్టులు చేసి రోడ్లపై కారులో తిప్పడం ఈ అరాచక ప్రభుత్వానికి అలవాటుగా మారింది. ఎన్నికల వేళ తాజాగా అనపర్తి మాజీ ఎమ్మెల్యే టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి శుక్రవారం ఉదయం అనపర్తిలో అదుపులోకి తీసుకుని సుమారు రెండు గంటలపాటు కారులో తిప్పుతూ చివరకు కొవ్వూరుకు తీసుకువచ్చారు. కొవ్వూరులో ఏ పోలీస్‌స్టేషన్‌లో ఉంచుతారోనని పోలీసులు, నాయకులు అంతా అప్రమత్తమయ్యారు. అయితే మధ్యలో ఏం జరిగిందో ఏమోగాని పోలీసులు రాజమహేంద్రవరం గామన్‌బ్రిడ్జిపై నుంచి కొవ్వూరు మీదుగా పంగిడి వైపు వెళ్లిపోయారు. కొంతదూరం వెళ్లిన తరువాత అక్కడ నుంచి వెనుదిరిగి వస్తుండగా గామన్‌బ్రిడ్జి టోల్‌గేట్ వద్ద కొవ్వూరు ద్విసభ్య కమిటీ సభ్యులు కంఠమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరిల ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు పోలీసుల వాహనాన్ని అడ్డుకున్నారు. తమ నాయకుడిని ఎందుకు అరెస్టుచేశారు, ఎక్కడికి తీసుకువెళ్తున్నారు, కారులో ఎందుకు తిప్పుతున్నారని డీఎస్పీని ప్రశ్నించారు. దీనికి డీఎస్పీ కేసు ఏం లేదని, ఇంటికి తీసుకువెళ్లి దింపుతామని చెప్పడంతో అయితే తన వాహనంలో తీసుకువెళ్తానని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కేఎస్ జవహర్ పట్టుపట్టారు. రామకృష్ణారెడ్డి పోలీసు కస్టడీలో ఉన్నందున తామే ఇంటివద్ద అప్పజెబుతామని డీఎస్పీ చెప్పారు. అయినా జవహర్ వినకుండా రామకృష్ణారెడ్డిని తరలిస్తున్న పోలీసు వాహనంలో ఎక్కి తానూ వస్తానంటూ పట్టుబట్టారు. ఈ సందర్భంగా కొవ్వూరు టీడీపీ ద్విసభ్య కమిటీ సభ్యులు కంఠమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి మాట్లాడుతూ అనపర్తి ప్రస్తుత వైసీపీ ఎమ్మెల్యే రూ.500 కోట్లు అవినీతికి పాల్పడ్డారని, దానిని నిరూపిస్తానని బయలుదేరిన రామకృష్ణారెడ్డిని ఏం జరిగిందని ఆలోచన చేయకుండా, మాజీ ఎమ్మెల్యే అని చూడకుండా అక్రమంగా అరెస్టు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అనంతరం అదే వాహనంలో రామకృష్ణారెడ్డిని అనపర్తి తరలించారు. ఈ కార్యక్రమంలో సూర్యదేవర రంజిత్, పొట్రు శ్రీనివాస్, కాగిత రఘు, బూరుగుపల్లి వీర రాఘవులు, కొత్తపల్లి ఆశిష్‌లాల్, జి.జి. చలం, వేమగిరి వెంకట్రావు, యనమదల శివరామకృష్ణ, కాకర్ల సత్యనారాయణ పాల్గొన్నారు.



కొవ్వూరు గామన్‌బ్రిడ్జి వద్ద పోలీసులను ప్రశ్నిస్తున్న నేతలు

వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో ఇద్దరికి కాంస్య పతకాలు

'నన్నయ' వీసీ ఆచార్య పద్మరాజు


విద్యార్థులను అభినందిస్తున్న వీసీ పద్మరాజు

దివాన్‌చెరువు, మార్చి 1: తమ విద్యార్థినులు అఖిల భారత, ఖేలో ఇండియా విశ్వవిద్యాలయ క్రీడల్లో ప్రతిభ కనబరిచి రెండు కాంస్య పతకాలను సాధించారని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు తెలిపారు. వర్సిటీలో శుక్రవారం జరిగిన అభినందన సభలో ఆయన మాట్లాడుతూ నన్నయ యూనివర్సిటీ అనుబంధ కళాశాలైన డీఆర్‌కే రెడ్డి వ్యాయామ విద్య కళాశాల (గొల్లలమామిడాడ)లో డిప్లమో ఇన్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రథమ సంవత్సరం చదువుతున్న బైరెడ్డి రాజేశ్వరి అఖిల భారత వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ 45 కిలోల కేటగిరిలోనూ, ఖేలో ఇండియా పోటీల్లో 49 కిలోల కేటగిరిలో బైరెడ్డి చంద్రిక కాంస్య పతకాలను సాధించారన్నారు. వీరిద్దరూ భవిష్యత్‌లో మరిన్ని పతకాలు గెలుచుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, ప్రిన్సిపాల్ కె.సుబ్బారావు, క్రీడా బోర్డు కార్యదర్శి బి.రామ్‌గోపాల్, పీడీ బి.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

షార్ కాంట్రాక్టర్ ఆత్మహత్య



సూళ్లూరుపేట, మార్చి 1: సూళ్లూరుపేట పట్టణంలోని బాపూజీ కాలనీలో నివాసం ఉంటున్న షార్ కాంట్రాక్టర్ వి.నాగేశ్వరరావు (55) శుక్రవారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసుల సమచారం మేరకు... రాజమహేంద్రవరానికి చెందిన నాగేశ్వరరావు గత 20 సంవత్సరాల పైబడి షార్‌లో అనసూయ ఇంజినీరింగ్ వర్క్స్ పేరుతో స్ట్రక్చరల్ కాంట్రాక్టర్‌గా పనులు చేస్తున్నారు. బాలాజీ నగర్‌లోని సొంత ఇంట్లో తన వద్ద పనిచేస్తున్న వర్కర్స్ ఉంటుండగా ఆయన బాపూజీ కాలనీలో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. ఆర్థిక ఇబ్బందులు తలెత్తి ఇటీవలే ఇంటిని కూడా అమ్మేసినట్లు తెలిసింది. శుక్రవారం అమ్మిన ఇంటిని రిజిస్ట్రేషన్ చేయాలని ఇంట్లో చెప్పి వెళ్లిన ఆయన బాలాజీ నగర్‌లో ఉన్న తన సొంత ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకొన్నారు. సాయంత్రం ఇంటికి వచ్చిన సిబ్బంది నాగేశ్వరరావు ఉరేసుకొని మృతి చెంది ఉండడాన్ని గమనించారు. వెంటనే ఆయన భార్యకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించి భార్యను వివరాలడిగి తెలుసుకొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రశాంతంగా ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు

3 జిల్లాల్లో 2,550 మంది గైర్హాజరు

పలు చోట్ల అసౌకర్యాలతో విద్యార్థుల ఇక్కట్లు


రాజమహేంద్రవరం: పరీక్ష కేంద్రం నుంచి బయటకు వస్తున్న విద్యార్థులు

రాజమహేంద్రవరం, మార్చి 1(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. తొలి రోజున మొదటి ఏడాది తెలుగు, సంస్కృతం, హిందీ పరీక్ష కావడంతో విద్యార్థులు కాస్త టెన్షన్ ఫ్రీగా కనిపించారు. ఉదయం 9 గంటలకు పరీక్ష ప్రారంభం కాగా.. గంట ముందుగానే చాలా మంది విద్యార్థులు పరీక్ష కేంద్రాల వద్దకు చేరుకున్నారు. విద్యార్థులను పూర్తిగా తనిఖీ చేసిన తర్వాత గదుల్లోకి అనుమతించారు. తూర్పుగోదావరి, కాకినాడ, అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లో జనరల్ విభాగంలో 52,277 మంది విద్యార్థులకు 50,411 మంది.. ఒకేషనల్‌లో 6,889కి 6,205 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. మూడు జిల్లాల్లో కలిపి మొత్తం 2,550 మంది గైర్హాజరయ్యారు. గ్రామాల నుంచి వచ్చే విద్యార్థులు సమయానికి బస్సులు అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆటోలను ఆశ్రయించి పరీక్ష కేంద్రాల వద్దకు చేరుకున్నారు. ఈ క్రమంలో ఉరుకులు పరుగులు తప్పలేదు. ప్రైవేటు కళాశాలలు విద్యార్థులు కళాశాలకు వస్తే అక్కడి నుంచి పరీక్ష కేంద్రానికి.. పరీక్ష ముగిసిన తర్వాత కళాశాలకు బస్సు సదుపాయం కల్పించకపోవడంతో విద్యార్థులకు ఇళ్లకు వెళ్లడానికి అవస్థలు తప్పలేదు. కొన్ని పరీక్షా కేంద్రాల్లోని గదుల్లో సీలింగ్ ఫ్యాన్లు పని చేయకపోవడంతో మూడు గంటల పాటు పరీక్ష రాసే క్రమంలో విద్యార్థులు అసౌకర్యానికి గురయ్యారు. అయితే, కిటికీలు తెరుచుకోవాలని అభ్యర్థులకు సిబ్బంది సలహా ఇచ్చారు. విద్యార్థులను పరీక్షా కేంద్రాలకు తీసుకొచ్చిన తల్లిదండ్రులు చాలా మంది వేచి చూడడానికి నీడ దొరక్క ఇబ్బంది పడ్డారు. మూడు గంటల పాటు వేచి ఉండే క్రమంలో ఎండ వేడిమికి ముఖ్యంగా మహిళలు, వృద్ధులు తీవ్రంగా అసౌకర్యానికి గురయ్యారు. తాగునీరు, మరుగుదొడ్లు సమస్యగా మారాయి. తూర్పుగోదావరి జిల్లాలో జనరల్ విభాగంలో 19,737 మందికి 19,309.. ఒకేషనల్ విభాగంలో 2,001కి 1,851 మంది విద్యార్థులు హాజరయ్యారు. కాకినాడ జిల్లాలో జనరల్ 21,045 మందికి 20,389.. ఒకేషనల్ 1,893కి 1,775.. డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో జనరల్ విభాగంలో 11,495 మంది విద్యార్థులకు 10,713.. ఒకేషనల్ విభాగంలో 2,995కి 2,579 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోలేదని ఇంటర్మీడియట్ విద్యా మండలి అధికారులు పేర్కొన్నారు. కాగా.. శనివారం(2వ తేదీన) రెండో ఏడాది జనరల్ విద్యార్థులకు ద్వితీయ భాష, ఒకేషనల్‌కి జనరల్ ఫౌండేషన్ కోర్సు పరీక్షలు జరుగుతాయి.


రాజమహేంద్రవరంలో ఓ పరీక్ష కేంద్రం వద్ద సందడి..

పంచాయతీల అభివృద్ధికి నిధులివ్వాలి

కలెక్టరేట్ వద్ద ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సర్పంచ్‌ల ధర్నా

సర్పంచ్‌లు, పోలీసుల మధ్య తోపులాట.. ఉద్రిక్తత..


సర్పంచ్‌లను నిలువరిస్తున్న పోలీసులు

కాకినాడ సిటీ, మార్చి 1: తమ న్యాయమైన 16 డిమాండ్లను పరిష్కరించాలని, పంచాయతీల అభివృద్ధికి నిధులు, అధికారాలను తక్షణమే ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చాంబర్ అండ్ సర్పంచ్‌ల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం కాకినాడ కలెక్టరేట్ వద్ద ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల సర్పంచ్‌లు చేపట్టిన ధర్నా ఉద్రిక్తతకు దారితీసింది. సర్పంచ్‌లను కలెక్టర్ కార్యాలయం వద్ద పోలీసులు అడ్డుకుని లోపలికి వెళ్లకుండా బారికేడ్లను ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో సర్పంచ్‌లకు పోలీసులకు మధ్య తోపులాట జరిగింది. అప్పటికే జనసేన-టీడీపీకి చెందిన నాయకులు అక్కడికి చేరుకోవడంతో ఉద్రిక్తత ఏర్పడింది. సర్పంచ్‌లను లోపలికి వెళ్లనీయకుండా పోలీసులు అడ్డుకున్నారు. పోలీసుల తీరును, ప్రభుత్వతీరును నిరసిస్తూ సర్పంచ్‌లు నినాదాలతో హోరెత్తించారు. ఏపీ పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర అధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ రోడ్లు, కాలువలు, తాగునీరు, వీధి దీపాలు వంటివి ప్రజలకు సమకూర్చలేక సర్పంచ్‌లు ఉత్సవ విగ్రహాలుగా మిగిలిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీలకు ఇవ్వాల్సిన వాటా నిధులు ఇవ్వకపోగా ఇతర ఆదాయం ద్వారా వచ్చే నిధులను, కేంద్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధి కోసం పంపిన 14, 15వ ఆర్థిక సంఘం నిధులు వేల కోట్ల రూపాయలను వైసీపీ ప్రభుత్వం దారి మళ్లించి సొంత పథకాలకు వాడుకుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిర్రు ప్రతాప్‌రెడ్డి, సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు వానపల్లి లక్ష్మి మాట్లాడుతూ గ్రామ వలంటీర్లు, సచివాలయ గృహ సారథులు, కన్వీనర్లను ప్రవేశపెట్టి పంచాయతీ సర్పంచ్‌లు, వార్డు సభ్యుల హక్కులు, అధికారాలను హరించివేశారన్నారు. అనంతరం కలెక్టర్‌కు పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం సమర్పించారు. కలెక్టరేట్ వద్ద సర్పంచ్‌ల నిరసన ధర్నాకు జనసేన పీఏసీ సభ్యులు పంతం నానాజీ సంఘీభావం తెలిపారు. టీడీపీ కాకినాడ రూరల్ నాయకులు నులుకుర్తి వెంకటేశ్వరరావు, డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, వాసిరెడ్డి ఏసుదాసు, రామదేవు సీతయ్యదొర, పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వై.వినోద్‌రాజు, రాష్ట్ర కార్యదర్శి జల్లి బాలరాజు, చిత్తూరు జిల్లా అధ్యక్షుడు చుక్క ధనుంజయ యాదవ్, తూర్పుగోదావరి జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.శాంతకుమారి, రంబాల రమేష్‌కుమార్, నాయకులు ప్రభాత్, నందమూరి రాజు, చిక్కం దొరబాబు, పెద్దరెడ్డి రాము పాల్గొన్నారు.

9న ప్రత్తిపాడుకు చంద్రబాబు

ప్రత్తిపాడు, మార్చి 1: తెలుగుదేశంపార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు మార్చి 9వ తేదీన కాకినాడ జిల్లా ప్రత్తిపాడు రానున్నారు. ప్రజాగళం పేరుతో నిర్వహించే భారీ బహిరంగ సభ కార్యక్రమంలో భాగంగా చంద్రబాబు పర్యటన ఖరారు అయినట్లు నియోజకవర్గ ఇంచార్జ్ వరుపుల సత్యప్రభ శుక్రవారం తెలిపారు. సమావేశానికి సత్యప్రభ స్థల పరిశీలన చేశారు. నరేంద్ర గిరి కొండ పరిసర ప్రాంతాలను, రాచపల్లి గ్రామ పొలిమేరలో స్థలాలను పరిశీలించారు. రెండు మూడు చోట్ల స్థలాలను చూసినా వాటిని ఇంకా ఆమోదించలేదని. శనివారం స్థల పరిశీలన ఒక కొలిక్కి వచ్చి ఖరారు చేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వి.సూర్యనారాయణరాజు, బి.గోపిరాజు, ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, బొదిరెడ్డి గోపి, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'ప్రసాద్ స్కీం' పనులపై వడివడిగా అడుగులు

అన్నవరం, మార్చి 1: ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో భక్తుల సౌకర్యాల కల్పన కోసం కేంద్ర ప్రభుత్వం రూ.20 కోట్లు మంజూరు చేయడంతో దీనికి సంబంధించిన పనులు వడివడిగా జరుగుతున్నాయి. అన్నవరం దేవస్థానంలో ఈ పనులను ప్రధాని మోదీ ఈనెల 7న వర్చువల్‌గా ప్రారంభిస్తారనే సమాచారంతో శుక్రవారం టూరిజం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాజారావు దేవస్థానం ఇంజనీరింగ్ అధికారులతో కలిసి స్థల పరిశీలన చేసి కొలతలు తీసుకున్నారు. రూ 20 కోట్లతో ప్రధానంగా అన్నదాన భవనం, అన్నప్రసాదం స్వీకరించే భక్తుల కోసం క్యూకాంప్లెక్స్ నిర్మించి ఎలక్ట్రికల్ బస్సులు కొనుగోలు చేయాలని ఆలోచన చేస్తున్నారు. ప్రధాని మోదీ వర్చువల్ ప్రారంభం అనంతరం కేంద్ర కమిటీ అన్నవరం సత్యదేవుడి సన్నిధికి విచ్చేసి నిర్మాణ స్థలాలను ప్రత్యక్షంగా పరిశీలించి టెండర్లు పిలవనున్నారు. ఈ పనులను దేవస్థానానికి సంబంధం లేకుండా టెండర్ ప్రక్రియ, నిర్మాణం అంతా టూరిజం పర్యవేక్షణలోనే జరగనున్నాయి. ఈ సందర్భంగా టూరిజం అధికారులు దేవస్థానం ఈవో రామచంద్ర మోహన్, చైర్మన్ రోహిత్‌లతో సమావేశమయ్యారు. దేవస్థానం ఈఈ మురళీ, డిప్యూటీ ఇంజనీర్ బిఎస్ రాంబాబు తదితరులున్నారు.

రత్నగిరిపై అల్లరి నరేష్ పూజలు


వేదాశీర్వచనం అందుకుంటున్న అల్లరి నరేష్

అన్నవరం, మార్చి 1: రత్నగిరివాసుడైన సత్యదేవుడి సన్నిధిలో శుక్రవారం సినీ నటుడు అల్లరి నరేష్ స్వామిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ ఏపీఆర్వో గణపతి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. దర్శనానంతరం వేద పండితులు వేదాశీర్వచనం అందజేశారు. ఆయనతో ఫొటోలు దిగేందుకు భక్తులు ఆసక్తి కనబర్చారు.

తలుపులమ్మను దర్శించుకున్న అల్లరి నరేష్

తుని రూరల్, మార్చి 1: తలుపులమ్మ లోవలో అమ్మవారిని శుక్రవారం సినీ నటుడు అల్లరి నరేష్ దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నరేష్ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

హత్యాయత్నం కేసులో అరెస్టు

అమలాపురం టౌన్, మార్చి 1: గత నెల 28వ తేదీన ఈదరపల్లిలో జరిగిన హత్యాయత్నం కేసులో నిందితుడైన ఎంపీటీసీ అడపా సతీష్ అలియాస్ సత్తిబాబును అరెస్టు చేసినట్టు అమలాపురం పట్టణ సీఐ కె.కిస్టఫర్ తెలిపారు. సత్తిబాబు తన భార్యతో వివాహేతర సంబంధం ఉందన్న అనుమానంతో అతని ఇంటి ఎదురుగా అద్దెకు ఉంటున్న కొత్తపల్లి సుబ్రహ్మణ్యం(48) పై పదునైన కత్తితో విచక్షణా రహితంగా దాడికి పాల్పడ్డాడు. తీవ్ర గాయాలపాలైన సుబ్రహ్మణ్యం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. సత్తిబాబును అరెస్టు చేసి శుక్రవారం కోర్టులో హాజరుపరచగా 14 రోజులు రిమాండు విధించారు. నిందితుడిని రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించినట్టు సీఐ తెలిపారు.

షాపు దగ్ధం: రూ.20 లక్షల నష్టం



రాజోలు, మార్చి 1: బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలులో శ్రీఆంజనేయస్వామి గుడి ఎదురుగా ఉన్న కనకం ఫ్యాన్సీ అండ్ జనరల్ స్టోర్ షాపులో షార్ట్ సర్క్యూట్ సంభవించింది. అగ్నిప్రమాదం జరిగి రూ.20 లక్షల ఆస్తి నష్టం సంభవించిందని రాజోలు అగ్నిమాపక అధికారి బాలకృష్ణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. షాపు యజమాని గ్రంధి నాగవెంకటసుబ్బారావు మధ్యాహ్నం సమయంలో భోజనానికి ఇంటికి వెళ్లగా షాపులో నుంచి అకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో స్థానికులు వెంటనే రాజోలు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. రాజోలు అగ్నిమాపక వాహనానికి డ్రైవరు లేకపోవడంతో పాలకొల్లు అగ్నిమాపక కేంద్రం నుంచి నగరం ఓఎన్జీసీ అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి పాలకొల్లు, నగరం నుంచి అగ్నిమాపక వాహనాలు వచ్చి మంటలను అదుపు చేశాయి. రాజోలు అగ్నిమాపక కేంద్రం నుంచి సరైన సమయంలో అగ్నిమాపక వాహనం వచ్చి ఉంటే ఆస్తి నష్టం తగ్గేదని స్థానికులు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు అగ్నిమాపక కేంద్రానికి డ్రైవరు ఉండే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరారు. సంఘటనా స్థలానికి జిల్లా అధికారి ఎస్.పార్థసారధి, రాజోలు ఎస్ఐ జి.పృథ్వీ వచ్చి పరిశీలించారు.

జీఎస్టీ ఎగవేతపై తనిఖీలు


ఎస్పీ సుబ్బారెడ్డి తనిఖీలు

రాజమహేంద్రవరం, మార్చి 1(ఆంధ్రజ్యోతి): దుకాణాల యజమానులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం జీఎస్టీ చెల్లించకుండా ఎగవేసినా, హోటళ్లు తదితర వ్యాపారులు వాణిజ్య అవసరాలకు గృహ వినియోగ గ్యాస్ సిలిండర్లు వాడినా కఠిన చర్యలు తప్పవని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ కేవీఎస్‌ఎస్‌వీ సుబ్బారెడ్డి హెచ్చరించారు. రాజమహేంద్రవరంలోని రాజ్‌గురు స్పేర్స్‌లో తనిఖీలు చేశామన్నారు. నాలుగు ప్రదేశాల్లో రూ.1,52,41,352 విలువ చేసే 10,805 వస్తువులకు సంబంధించి స్టాక్ వెరిఫికేషన్ చేశామన్నారు. స్టాక్, కొనుగోలు, విక్రయ రిజిస్టర్లు నిర్వహించకపోవడం గుర్తించామని చెప్పారు. కొన్ని వస్తువులకు సంబంధించి వినియోగదారులు, తయారీదారుల వివరాలు, తప్పనిసరి డిక్లరేషన్ లేకపోవడంతో 5 కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. అలాగే నిడదవోలు మండలంలోని గోపవరంలో టీ-కేఫ్ హోటల్‌లో తనిఖీలు చేయగా వాణిజ్య అవసరాలకు వాడుతున్న 5 గృహ వినియోగ సిలిండర్లను గుర్తించి స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామన్నారు. తనిఖీల్లో డీఎస్పీ ముత్యాలనాయుడు, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరెడ్డి, ఏవో భార్గవ మహేశ్, లక్ష్మీనారాయణ, లీగల్ మెట్రాలజీ, కమర్షియల్ ట్యాక్స్, రెవెన్యూ, పౌర సరఫరాల శాఖ అధికారులు పాల్గొన్నారు.

16న జాతీయ లోక్ అదాలత్

రాజమహేంద్రవరం, మార్చి 1(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల ప్రకారం ఈ నెల 9న జరగాల్సిన జాతీయ లోక్ అదాలత్ 16న నిర్వహించడం జరుగుతుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూష కుమారి తెలిపారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని అన్ని న్యాయస్థానాల్లో రాజీపడదగిన కేసులను పరిష్కరించుకోడానికి జాతీయ లోక్ అదాలత్‌ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

ఏజెన్సీ సమాచారం

ఆర్గానిక్ ఆహారంతో మేలు

రంపచోడవరం, మార్చి 1: ఆర్గానిక్ ఆహార పదార్థాలే మానవ మనుగడకు దోహదపడతాయని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే చెప్పారు. రంపచోడవరంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన తాటి ఆధారిత ఆహార పదార్థాల తయారీ అంశంపై నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాటి చెట్ల ఉత్పత్తులతో మానవాళికి ఎంతో మేలు జరుగుతుందని అన్నారు. తాటి నీరా కొనుగోలు ధర రూ.25లుగా నిర్థారించామని, గిరిజన రైతులను ఈ కేంద్రానికి తీసుకువచ్చి వారికి అవగాహన కల్పిస్తే రోజుకు 500 లీటర్ల నీరా వస్తుందని, తద్వారా ఎన్నో రకాల ఉత్పత్తులు ఇక్కడ తయారు కావడమే కాకుండా ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయని అన్నారు. తాటి నీరాను శుద్ధి చేసి ఆర్గానిక్ నీరాగా మార్చే ప్రణాళికలు ఉన్నాయన్నారు. నీరా ఆధారిత వస్తువుల తయారీకి కృషి విజ్ఞాన కేంద్రం ఉత్తమ కేంద్రంగా నిలుస్తోందని చెప్పారు. మన్యంలోని గిరిజన రైతులను ఇందులో భాగస్వామ్యులను చేసే బాధ్యత వ్యవసాయ, ఉద్యాన వన అధికారులపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం కో ఆర్డినేటర్ లలిత కామేశ్వరి, సీనియర్ సైంటిస్టులు కె.రాజేంద్రప్రసాద్, పీసీ వెంకయ్య, ప్రాజెక్టు ఉద్యానవన అధికారి కె.చిట్టిబాబు, ప్రాజెక్టు వ్యవసాయ అధికారి ఎల్. రాంబాబు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు


పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న పీవో

రంపచోడవరం, మార్చి1: ఇంటర్మీడియట్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలను సాధించి ఉన్నత విద్యకు మార్గాలను సుగమం చేసుకోవాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే సూచించారు. రంపచోడవరంలో శుక్రవారం పలు ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఎక్కడా విద్యార్థులు అసౌకర్యానికి గురి కాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.

ఇంటర్‌లో 13 మంది గైర్హాజరు

వై.రామవరం, మార్చి 1: వై.రామవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని ఇంటర్ పరీక్షా కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన ప్రథమ సంవత్సరం తెలుగు పరీక్షకు 13 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఈ కేంద్రంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల, పి.యర్రగొండ గురుకుల బాలికల కళాశాల, తోటకూరపాలెం కేజీబీవీ కళాశాలల నుంచి మొత్తం 163 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 150మంది పరీక్షలు రాసినట్లు చీఫ్ సూపరింటెండెంట్ ఈశ్వరకృప తెలిపారు.

ప్రశాంతంగా పరీక్షలు

కూనవరం,మార్చి 1: స్థానిక జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సర పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. తొలిరోజు తెలుగు పరీక్ష నిర్వహించారు. మొత్తం 252 మంది విద్యార్థులకు గాను 247 మంది విద్యార్థులు హాజరైనట్లు ప్రిన్సిపాల్ శ్రీరామ్మూర్తి తెలిపారు.

అడవికి నిప్పు-భవితకు ముప్పుపై కళాజాత

దేవీపట్నం,మార్చి 1: ఇందుకూరు రేంజ్ ఎఫ్ఆర్‌వో వి.దుర్గాకుమార్‌బాబు ఆధ్వర్యంలో అడవికి నిప్పు-భవితకు ముప్పు అనే అంశంపై శుక్రవారం కళాజాత నిర్వహించారు. దేవీపట్నం మండలంలోని ఎర్రమెట్ల, పెద్దనుతులు, మద్దిరాతిగూడెం, చొప్పకొండ, దామనపల్లి గ్రామాల్లో కళాజాత కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమాల్లో అడవికి నిప్పు వల్ల నష్టాలు, నిప్పుని ఆర్పే ప్రక్రియలు, వన్యప్రాణి సంరక్షణ గురించి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. దేవీపట్నం ఎఫ్ఎస్‌వో ఈ.శేఖర్‌బాబు, దామనపల్లి ఎఫ్ఎస్‌వో టి.వీరన్నదొర, ఇందుకూరు ఎఫ్ఎస్‌వో పి.శ్యాంకుమార్, దేవీపట్నం ఎఫ్‌బీవో ఎం.శ్రీనివాసదొర, మంటూరు ఎఫ్‌బీవో ఎస్.వెంకటరమణ, వీరవరం ఎఫ్‌బీవో బి.రాజశేఖర్, కచ్చులూరు ఎఫ్‌బీవో వి.శివకుమార్, పెద్దనుతులు ఎఫ్‌బీవో కె.అమ్మాజీ, రేంజ్ సిబ్బంది పాల్గొన్నారు.

భారీగా గోదావరి రేవు వేలం

కూనవరం,మార్చి 1: కూనవరం రుద్రమ్మకోట గోదావరి రేవు వేలం పాట రికార్డు స్థాయిలో ధర పలికింది. గతేడాది ఈ వేలం పాట రూ.36.30 లక్షలకు జరగగా ఈసారి అత్యధికంగా రూ.80 లక్షలకు ధర పలకడం విశేషం. దాదాపు మూడు రెట్లకు వీఆర్‌పురం మండలం పోతవరం గ్రామానికి చెందిన వాళ్ల బాపూజీ ఈ పడవరేవు వేలం పాటను దక్కించుకున్నారు. కూనవరం రుద్రమ్మకోట పడవరేవులో అత్యధికంగా గిరిజనులు రాకపోకలు సాగిస్తుంటారు. ఏలూరు జిల్లా, అల్లూరి జిల్లా నుంచే కాకుండా ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ నుంచి కూడా గిరిజనులు రాకపోకలు కొనసాగిస్తారు. గత రెండు సంవత్సరాల నుంచి ఈ పడవ రేవు వేలం పాట రేటు పెరుగుతోంది. గతంలో ప్రతీ వేసవి ముందే గోదావరిలో నీళ్ల తగ్గిపోవడంతో ఖాళీ రేవు ఏర్పడేది. దీంతో పడవ తిరక్కపోవడంతో పడవ యజమానికి తక్కువ లాభాలు వచ్చేవి. అయితే ఈ సారి పోలవరం ప్రాజెక్టు కారణంగా బ్యాక్‌వాటర్ నిల్వ ఉండడంతో గోదావరి నిండుకుండలా ఉంటుంది. దీంతో ఖాళీరేవు ఏర్పడకపోవడంతో నిత్యం పడవ రాకపోకలు సాగిస్తుండడంతో ఈ వేలం పాటకు డిమాండ్ పెరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపీడీవోతో పాటు కూనవరం మేజర్ పంచాయతీ ఈవో సురేష్ కుమార్, పంచాయతీ సర్పంచ్ హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

మన ఓటు మన భవిష్యత్ కార్యక్రమం నిర్వహణ

కూనవరం,మార్చి 1: మన ఓటు మన భవిష్యత్ పేరుతో కూనవరం యూటీఎఫ్ నాయకులు కార్యక్రమం నిర్వహించారు. యూటీఎఫ్ మండలాధ్యక్షుడి అధ్యక్షతన జరిగిన సమావేశంలో యూటీఎఫ్ మండల కార్యదర్శి పి.కన్నారావు మాట్లాడుతూ మన ఓటు మన భవిష్యత్ అంటూ ఓట్ ఫర్ ఓపీఎస్ అనే నినాదంతో వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. రాజకీయ నాయకుల భవిష్యత్ నిర్ణయించేది మన ఓటు మాత్రమేనని పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసే రాజకీయ పార్టీలకే ఉద్యోగులు ఓటు వేయాలని కన్నారావు పిలుపునిచ్చారు. రాబోయే ఎన్నికల్లో మంచి ప్రభుత్వాన్ని ఎన్నుకుని ఉద్యోగులు హక్కులు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాంబాబు, వెంకటయ్య, రంజిత్‌కుమార్, నందిని, కుమారి, శ్రీనాగదుర్గ పాల్గొన్నారు.

ఐదుగురు పేకాట రాయుళ్లు అరెస్ట్

ఎటపాక, మార్చి 1: ఎటపాక మండలంలోని గుండాల-పురుషోత్తపట్నం గ్రామాల మధ్యలో ఓ జామాయిల్ తోటలో ఏర్పాటు చేసిన పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేశారు. జామాయిల్ తోటలో గుట్టుచప్పుడు కాకుండా పేకాట ఆడుతున్న భద్రాచలానికి చెందిన రాజేష్,దుర్గాప్రసాద్,రాజేష్, శివకుమార్, వెంకటేష్‌లను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ కె.పార్థసారథి తెలిపారు. పేకాట శిబిరంలో రూ.8,200 నగదును స్వాధీనం చేసుకున్నారు. గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

వెదురు ఉత్పత్తుల తయారీపై శిక్షణ

రంపచోడవరం, మార్చి 1: గిరిజన యువతకు వెదురు ఉత్పత్తుల తయారీలో శిక్షణ ఇస్తున్నామని, ఇందుకు అర్హులైన యువత దరఖాస్తు చేసుకోవాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూచించారు. ఈ మేరకు ఆయన కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదలైంది. రంపచోడవరం వైటీసీలో ఈ శిక్షణను ఏర్పాటు చేస్తున్నామని, వెదురు ఆధారిత ఫర్నీచర్, ఇతర వస్తువుల తయారీ విషయాలలో ఈ శిక్షణను ఇస్తున్నామని ఆయన పేర్కొన్నారు. తొలి విడతలో 30 మందికి ఇస్తున్నామన్నారు. ఈ నెల 5లోగా దరఖాస్తు చేసుకోవాలని అన్నారు.

పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించాలి

రంపచోడవరం, మార్చి 1: మన్యంలో ఐదు సంవత్సరాల వయసులోపు ఉన్న పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్‌గనోరే పిలుపునిచ్చారు. శుక్రవారం ఈ మేరకు ఆయన పోలియో చుక్కల కార్యక్రమంపై ఒక బ్యానర్‌ను ఆవిష్కరించారు. ఈ నెల 3న మన్యం ఏడు మండలాలలో పోలియో చుక్కలను వేయించే కార్యక్రమం చేపడుతున్నామన్నారు. ఇందుకోసం ప్రతి గ్రామంలోనూ పోలియో చుక్కల కేంద్రాలను ఏర్పాటు చేశామని, అనంతరం 4, 5 తేదీలలలో ప్రతి ఇంటికీ వెళ్లి పోలియో చుక్కలను వేస్తామని అన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి అభినందన

అడ్డతీగల, మార్చి 1: రాష్ట్ర స్థాయిలో రోల్ మోడల్ స్కూల్ ఉత్తమ ఉపాధ్యాయునిగా అల్లూరి జిల్లా అడ్డతీగల మండలం బడదం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు సడేల నాగప్రసాద్ ఎన్నిక అవ్వడంపై యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి తేజోరావు హర్షం వ్యక్తం చేశారు. అభినందన సభలో ఏజెన్సీ డీఈవో మల్లేశ్వరరావు, మండల విద్యాశాఖాధికారి శ్రీనివాసరావు, మండల యూటీఎఫ్ అధికారి కె.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి రాఘవులు, దొరబాబు, జగదీష్, మంగరాజు, కమల రత్నం, రమణమ్మ మండల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైసీపీని ఓడించడమే లక్ష్యం

» కృష్ణార్జునులై అడుగేద్దాం: బత్తుల
» కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలి: బీవీఆర్
» చినకొండేపూడిలో టీడీపీ-జనసేన ఆత్మీయ సమావేశం

సీతానగరం, మార్చి 1: వైసీపీని ఓడించడమే లక్ష్యంగా రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కృష్ణార్జునులుగా ఎన్నికల శంఖారావాన్ని పూరిద్దామని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బత్తుల బలరామకృష్ణ అన్నారు. శుక్రవారం చినకొండేపూడి జీవీకే ఫంక్షన్ హాల్‌లో తెలుగుదేశం-జనసేన ఆత్మీయ సమావేశం జరిగింది. దీనికి బత్తులతోపాటు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణచౌదరి ముఖ్యఅతిథులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా బత్తుల మాట్లాడుతూ వెంకటరమణచౌదరి కృష్ణుడుగాను, తాను అర్జునుడుగాను అభివర్ణించారు. వైసీపీ రాక్షస పాలన నుంచి ప్రజాస్వామ్య పార్టీలను, ప్రజలను రక్షించుకోవాలంటే వచ్చే ఎన్నికల్లో గెలిచి చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయాలన్నారు. పార్టీ గెలిచిన తరువాత ప్రకృతి వనరులకు కాపలాకాస్తామన్నారు. వెంకటరమణచౌదరి మాట్లాడుతూ ముందుగా టిక్కెట్ వస్తుందని ఆశించానని, నాయకులు పొత్తులు పెట్టుకోవడంతో పార్టీ నాయకుల ఆదేశాల మేరకు రాజానగరం నియోజకవర్గం జనసేనకు కేటాయించడంతో ఒకింత బాధ అనిపించినా పార్టీ ప్రయోజనాల దృష్ట్యా పొత్తులను గౌరవించి రాజానగరంలో జనసేన విజయానికి కృషిచేస్తామన్నారు. టీడీపీ కార్యకర్తలు సమష్టిగా జనసేన నాయకులతో కలసి ప్రచార కార్యక్రమాలు నిర్వహించి విజయానికి కృషి చేయాలని పార్టీ కేడర్‌కు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఇరు పార్టీల నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


టీడీపీ, జనసేన జెండాలను ఎగురవేస్తున్న బీవీఆర్ చౌదరి, బత్తుల


47వ డివిజన్‌లో ప్రజలతో ఆదిరెడ్డి వాసు

కమిషన్ల కోసం కక్కుర్తి పనులు.. ప్రజలకు శాపం
భవిష్యత్తుకు గ్యారెంటీలో ఆదిరెడ్డి వాసు

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 1: ఎంపీ మార్గాని భరత్‌రామ్ కమిషన్లకు కక్కుర్తిపడి చేసిన పనులు నగర ప్రజలకు శాపంగా మారుతున్నాయని టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం రాజమహేంద్రవరంలోని 47వ డివిజన్‌లో టీడీపీ నాయకులు బేసరి చిన్ని, కవులూరి వెంకట్రావు ఆధ్వర్యంలో జరిగిన భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకుని, మేనిఫెస్టోలోని సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. అనంతరం ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ ఎంపీ భరత్ కమీషన్లకు కక్కుర్తిపడి, అనాలోచి నిర్ణయాలతో పుష్కరాల రేవు, దేవి చౌక్ తదితర ప్రాంతాల్లో వేసిన రాళ్లు ఊడిపోతున్నాయన్నారు. అతని స్వార్థం కోసం రోడ్లను ఇరుకు చేయడంతో పాటు సరైన ప్రణాళిక లేకుండా చేపట్టిన పనులతో చిన్నపాటి వర్షాలకే దేవిచౌక్, గోకవరం బస్టాండ్ ప్రాంతాలు నీట మునుగుతున్నాయన్నారు. ఈ సమస్యను తాము అధికారంలోకి వచ్చాక పరిష్కరిస్తామని ఆ ప్రాంత ప్రజలకు హామీ ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహాసేన రాజేష్‌ను అరెస్ట్ చేయాలంటూ ఫిర్యాదు

గోకవరం, మార్చి 1: జగన్మాత పార్వతీదేవిపై అసభ్య పదజాలంతో మాట్లాడిన మహాసేన రాజేష్‌ను వెంటనే అరెస్ట్ చేయాలంటూ శుక్రవారం గోకవరంలో విశ్వ హిందూ ధర్మ పరిరక్షణ రామసేన సభ్యులు ఆందోళన నిర్వహించారు. ముందుగా ఆందోళనకారులు స్థానిక దేవీచౌక్ ఆలయం వద్ద సమావేశం నిర్వహించి మహాసేన రాజేష్‌పై చర్యలు తీసుకోవాలని తీర్మానం చేశారు. ఈ సందర్భంగా రామసేన సభ్యులు మాట్లాడుతూ రామసేన వ్యవస్థాపక అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు ఆదేశాల మేరకు ఈ నిరసన కార్యక్రమాన్ని హిందూ బంధువులందరూ చేపట్టారన్నారు. పార్వతీదేవి అమ్మవారిని వక్రీకరిస్తూ రాజేష్ మాట్లాడడం చాలా బాధాకరమన్నారు. అలాగే ఆది గురువైన మహాగణపతి పుట్టుకపై కూడా అసభ్యకరమైన వ్యాఖ్యలు చేసిన రాజేష్‌కు సమాజంలో ఉండే అర్హత లేదంటూ మండిపడ్డారు. కులాల మధ్య చిచ్చు పెట్టే విధంగా అతని వ్యవహారశైలి ఉందని విమర్శించారు. అనంతరం రాజేష్‌పై చర్యలు తీసుకోవాలంటూ ఆందోళనకారులు ఎస్ఐ నాగరాజుకు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో రామసేన సభ్యులు మామిడి అయ్యప్ప, తామర్ల రాంబాబు, ఉంగరాల ఆదివిష్ణు, వరసాల ప్రసాద్, ఇనగోటి బాపన్నదొర, బీజేపీ నాయకులు సత్తి వెంకటరెడ్డి, కట్టా కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.


ఎస్ఐకు వినతిపత్రం అందజేస్తున్న విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన

జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధికి చర్యలు
కలెక్టర్ మాధవీలత

రాజమహేంద్రవరం రూరల్/సిటీ, మార్చి 1: ఎంఎస్ఎంఈలను గుర్తించి చేయూత అందించి కేంద్ర ప్రభుత్వ ర్యాంప్ పథకంతో ఏకీకృతం చేయడం ద్వారా జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధి కోసం అవసరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత తెలిపారు. జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధికి ఎంఎస్ఎంఈలను గుర్తించి వాటిని మెరుగుపరచడం, అభివృద్ధి చేయడం కోసం ప్రపంచ బ్యాంకు ఆర్థిక సహకారంతో కేంద్ర ప్రభుత్వం ర్యాంప్ అనే స్కీమ్‌ను ప్రకటించిందన్నారు. ఈ మేరకు జిల్లాలో 20 రోజుల పాటు సర్వే ద్వారా ఆసక్తి గల తయారీ సేవ, వాణిజ్య రంగాల్లో అన్ని ఎంఎస్ఎంఈలను గుర్తించనున్నట్టు చెప్పారు. రీసర్వే ద్వారా సేకరించిన డేటాను డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లోకి తీసుకువచ్చి ఏపీ ఎంఎస్ఎంఈ వన్ పోర్టల్‌కు అనుసంధానిస్తామన్నారు. జిల్లా పారిశ్రామిక అధికారి బి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఏపీ ఎంఎస్ఎంఈ అభివృద్ధి కార్పొరేషన్ సహకారంతో ఈ సర్వే చేస్తున్నట్టు తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో అధికారుల పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. డేటా ఎంట్రీ చేసేందుకు మునిసిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలకు ఆదేశాలు జారీ చేశామన్నారు. ఎంఎస్ఎంఈ సర్వే అండ్ సపోర్ట్ అనే యాప్‌ను రూపొందించారని, వాటిలో వివరాలు నమోదు చేస్తున్నామని చెప్పారు. వివిధ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించడం, మహిళలు, ఎస్సీఎస్టీ పారిశ్రామికవేత్తల నైపుణ్యాలను అభివృద్ధి పరచడం వంటి సేవలు ఎంఎస్ఎంఈలకు అందుబాటులో తీసుకురావడం, సర్వేలో గుర్తించి నమోదు కాని వారికి అవగాహన శిబిరాలు నిర్వహించనున్నట్టు వెంకటేశ్వరరావు పేర్కొన్నారు.

విద్యుత్ నిఘాశాఖ దాడులు

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 1: విద్యుత్ నిఘా శాఖాధికారులు శుక్రవారం కాకినాడ జిల్లాలో పలు ప్రాంతాల్లో దాడులు చేసినట్టు విద్యుత్ విజిలెన్స్ రాజమహేంద్రవరం సీఐ కె.నాగమోహన్ రెడ్డి తెలిపారు. అధికారుల సూచనలమేరకు కాకినాడ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టి.విష్ణుమూర్తి తాను కలిసి జిల్లాలో కరప మండలం గొర్రిపూడిలో విద్యుత్ మీటర్ బైపాస్ చేసి చౌర్యం చేస్తున్న వ్యక్తిని గుర్తించి అతనికి రూ.96,627 అపరాధ రుసుము, రూ.7 వేలు జరిమానా విధించినట్టు తెలిపారు. ఫిబ్రవరి నెలలో విద్యుత్ నిఘా శాఖ దాడులు చేసి 95 కేసులు నమోదు చేశామని, చౌర్యం చేస్తున్న వారి నుంచి రూ1,18,000 జరిమానా వసూలు చేశామని నాగమోహన్ రెడ్డి తెలిపారు.

టీడీపీ-జనసేన కూటమికి మద్దతు ఇవ్వండి
బార్ అసోసియేషన్ న్యాయవాదులను కోరిన గోరంట్ల

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 1: రాబోయే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో టీడీపీ-జనసేన కూటమికి మద్దతు ఇవ్వాలని టీడీపీ సీనియర్ నేత, రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి కోరారు. రాజమండ్రి బార్ అసోసియేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన టీడీపీ న్యాయవాదుల ఆత్మీయ కలయిక కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా గోరంట్లను సీనియర్ న్యాయవాదులు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, కార్యదర్శులు సత్కరించారు. అనంతరం గోరంట్ల మాట్లాడుతూ విద్యావంతులైన న్యాయవాదులు ప్రతిఒక్కరు రాష్ట్ర భవిష్యత్తును, అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని మద్దతు తెలియజేయాలని అభ్యర్థించారు. అసంపూర్ణంగా ఉన్న న్యాయస్థాన భవనాలను పరిశీలించి సత్వరమే బిల్డింగ్ పూర్తయేలా ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో లీగల్ సెల్ సభ్యులు పాల్గొన్నారు.

రత్నంపేటలో ఎన్ఎస్ఎస్ సేవా శిబిరం

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 1: రాజమహేంద్రవరంలోని రత్నంపేట స్లమ్ ఏరియాలో శుక్రవారం రాజమహేంద్రి మహిళా డిగ్రీ, పీజీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-1 వలంటీర్లు ప్రత్యేక సేవా శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని కళాశాల చైర్మన్ టీకే విశ్వేశ్వరరెడ్డి, డాక్టర్ అనసూరి పద్మలత, కళాశాల ప్రిన్సిపాల్ సత్యసౌందర్య ప్రారంభించారు. ఈ శిబిరం ఏడు రోజులపాటు కొనసాగుతుందని విశ్వేశ్వరరెడ్డి చెప్పారు. డాక్టర్ పద్మలత మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాల్లో ఉమ్మి వేయడం, మలమూత్ర విసర్జన చేయడం వల్ల వచ్చే ఆరోగ్య సమస్యలపై ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ప్రతి ఇంటికీ వెళ్లి అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీవో డీవీ వెంకటరావు, కె.సుధారాణి పాల్గొన్నారు.

శరత్‌బాబు అరెస్టుకు గన్ని కృష్ణ ఖండన

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 1: టీడీపీ నేత, మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావుపై కక్షతో అతని కుమారుడు శరత్‌బాబును అక్రమంగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ శుక్రవారం ఓ ప్రకటనలో అన్నారు. రానున్న ఎన్నికల్లో ఓటమి భయంతో సీఎం జగన్ దుర్మార్గపు రాజకీయాలకు పాల్పడుతున్నాడన్నారు. ఏ కంపెనీలోను డైరెక్టర్‌గా కాని, షేర్ హోల్డర్‌గా కాని లేని శరత్‌బాబుపై జీఎస్టీ ఎగవేత అభియోగంతో కేసులు పెట్టడం దారుణమన్నారు.

రాజమహేంద్రవరంలో రక్తదాన శిబిరం

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 1: రాజమహేంద్రవరం సెంట్రల్ సమీపంలో బాధ్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. రక్తదానం చేసిన యువతకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ అధ్యక్షుడు గారా అజయ్‌కుమార్ మాట్లాడుతూ అవసరమైన వారికి సకాలంలో రక్తం అందించాలనే సంకల్పంతో బాధ్యత ఫౌండేషన్ ఏర్పాటు చేశామని, ఈ మేరకు ప్రతి నెల శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు రామకృష్ణ, గారా జ్యోత్స్న కోవగాని ప్రసాద్, రమేష్, శిరీష, సంజీవని బ్లడ్‌బ్యాంక్ మేనేజరు ప్రకాష్, బీరా రాజు పాల్గొన్నారు.

క్వారీ గోతుల సమస్యకు పరిష్కారం
స్థాయీ సంఘం మాజీ చైర్మన్ కొండబాబు


సమావేశంలో మాట్లాడుతున్న బర్రే కొండబాబు

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 1: ఎన్నో ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోకుండా ఉన్న క్వారీ గోతుల సమస్యకు పరిష్కారం లభించిందని స్థాయీ సంఘం మాజీ చైర్మన్ బర్రే కొండబాబు అన్నారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను నివసిస్తున్న ప్రాంతమైన క్వారీలో ఉన్న గోతుల వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రమాదవశాత్తూ గోతుల్లో నీటిలో పడి మరణిస్తున్నారని, దీనిపై తాను అనేక ఉద్యమాలు చేశానని ఏ కమిషనర్ పట్టించుకోలేదని పేర్కొన్నారు. ప్రస్తుత కమిషనర్ దినేష్‌కుమార్ మాత్రం క్వారీ యాజమాన్యాలతోను బాధితులతోను సమావేశం నిర్వహించి ఒక జేఏసీగా ఏర్పాటు చేసి సమస్యకు పరిష్కారం చూపించారన్నారు. శోనిటోరియ నుంచి సున్నం బట్టి రోడ్డు వేయడం, క్వారీగోతుల్లో నీటిని యాజనులే తోడించడం, ప్రమాదకరంగా ఉన్న చోట ఉన్న రెండిళ్లను తొలగించి మరో చోట ఇంటి పట్టాలు ఇచ్చి గోతుల చుట్టు రక్షణ గోడ నిర్మించడం వంటి పనులు చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. ఈ నెలాఖరు నాటికి పనులు ప్రారంభిస్తారన్నారు. దీంతో తాను చేస్తున్న ఉద్యమాన్ని తాత్కాలికంగా విరమించానని కొండబాబు చెప్పారు. సమావేశంలో జాన్ చార్లెస్, గారా త్రినాథ్, స్టీఫెన్సన్, స్థానిక మహిళలు, హిజ్రాలు పాల్గొన్నారు.

రాజానగరం ఎమ్మెల్యే
కాంగ్రెస్ అభ్యర్థిత్వానికి పెందుర్తి దరఖాస్తు

సీతానగరం, మార్చి 1: రాజానగరం కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పెందుర్తి దేవదాసు దరఖాస్తు చేసుకున్నారు. ఆయన దరఖాస్తును పార్టీ కార్యాలయంలో సమర్పించారు. కాగా ప్రస్తుతం ఆయన తెలుగుదేశం పార్టీలో కొనసాగుతున్నారు. ప్రస్తుతం ఎమ్మెల్యే అభ్యర్థుల దరఖాస్తులను కాంగ్రెస్ పార్టీ స్వీకరిస్తుండడంతో ఆయన తన దరఖాస్తును అందించారు. అయితే ఆయన అధికారికంగా ప్రకటించలేదు. కానీ ఆయనకు పార్టీ టికెట్ ఇస్తే పార్టీలో చేరి ఎమ్మెల్యేగా కంటెస్ట్ చేసే అవకాశం ఉంది. ఈయన తొలుత కాంగ్రెస్ పార్టీలో కొనసాగి సీతానగరం ఎంపీపీగా పనిచేశారు. తదుపరి ఆయన సోదరుడు పెందుర్తి వెంకటేష్ బూరుగుపూడి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జిగా వచ్చిన తరువాత అయన తెలుగుదేశం పార్టీలో చేరారు. అప్పటి నుంచి నేటి వరకు తెలుగుదేశం పార్టీలో కొనసాగుతున్నా, పార్టీ కార్యక్రమాలకు పెద్దగా హాజరు కావడం లేదు. ప్రస్తుతం ఆయన మళ్లీ కాంగ్రెస్ పార్టీ రాజానగరం అభ్యర్థిత్వానికి దరఖాస్తు చేసుకున్నారు. ఈయనకు ముందుగా రాజానగరం ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించి తదుపరి పార్టీ టికెట్ ఇవ్వడానికి అధిష్ఠానం ఆలోచనలో ఉన్నట్టు తెలుస్తోంది. ఈ విషయం మండలంలో చర్చనీయాంశంగా మారింది.

కడియం ఏవో చంద్రరావు బదిలీ

కడియం, మార్చి 1: కడియం ఎంపీడీవో కార్యాలయంలో ఏవోగా బాధ్యతలు నిర్వహిస్తున్న కె.చంద్రరావు గండేపల్లి బదిలీ అయ్యారు. గండేపల్లి మండలంలో పనిచేస్తున్న ఏవో పీవీ సుబ్బారావు కడియం రానున్నారు.

ఎంఈవోగా మణికుమార్

కడియం, మార్చి 1: కడియం మండల విద్యాశాఖ అధికారిగా కోరుకొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పనిచేసిన మణికుమార్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయనను ఎస్టీయూ నాయకులు, పలువురు ఉపాధ్యాయులు మర్యాద పూర్వకంగా కలిశారు.

సాంబశివరావుకు పీహెచ్‌డీ ప్రదానం



దివాన్‌చెరువు, మార్చి1: కుప్పంలోని ద్రవిడ విశ్వవిద్యాలయం నుంచి పీహెచ్‌డీ పొందిన ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం విద్యా కళాశాల సహాయాచార్యుడు ఆర్. సాంబశివరావును ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు శుక్రవారం అభినందించారు. ద్రవిడ వర్సిటీ విద్యాశాఖ ఆచార్యుడు ఎల్.కె.ఎం. బాబూరావు చౌదరి పర్యవేక్షణలో తూర్పుగోదావరి జిల్లాలోని ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయుల బోధనా సామర్థ్యంపై ఒత్తిడి, ప్రభావం అనే అంశంపై చేసిన పరిశోధనకు సాంబశివరావుకు ద్రవిడ వర్సిటీ పీహెచ్‌డీ ప్రదానం చేసిందని తెలిపారు. ఈ ధ్రువపత్రాన్ని వీసీ పద్మరాజు ఆయనకు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఏపీ తెలుగు సంస్కృత అకాడమీ ముద్రించిన డీఎస్సీ స్కూల్ అసిస్టెంట్-గణితశాస్త్రం పుస్తక రచయితల్లో ఒకరైన సాంబశివరావును అభినందించి ఆ పుస్తకాన్ని వీసీ విడుదల చేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, ఈసీ సభ్యులు పి.విజయనిర్మల, కె.నూకరత్నం, పి.సురేష్ వర్మ, అధ్యాపకులు కేఎస్ రమేష్, బి.జగన్మోహనరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోటపాడులో 'ఆరోగ్య సురక్ష'

రంగంపేట, మార్చి 1: మండలంలోని కోటపాడు గ్రామ సచివాలయంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ గవరసాని దుర్గలక్ష్మీ అధ్యక్షతన రంగంపేట పీహెచ్‌సీ వైద్యాధికారిణి బి.వేణుశ్రీలక్ష్మీ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో 311 మందికి వైద్య సేవలందించారు. అవసరమైన వారికి ఈసీజీ, రక్తపరీక్షలు చేసి రోగ నిర్ధారణ చేసి మందులు పంపిణీ చేశారు. డాక్టర్లు కేవీ పూజిత, పి.శశాంక్, సత్యప్రసాద్ సేవలందించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సుంకర అప్పారావు, గ్రామ కార్యదర్శి మణికుమార్, సీహెచ్‌వో కె.జయమణి, ల్యాబ్‌టెక్నీషియన్ మణికంఠ, పీహెచ్‌సీ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

ఇంటర్మీడియట్ పరీక్షలకు 567 మంది హాజరు

రంగంపేట, మార్చి 1: రంగంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం నుంచి ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభమయ్యాయని పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ బి.హేమ తెలిపారు. మొదటిరోజు ఫస్టియర్ తెలుగు పరీక్షకు 586 మందికి గాను 567 మంది హాజరయ్యారని, 19 మంది గైర్హాజరయ్యారన్నారు. వీరిలో ఒకరు సంస్కృతం, ఏడుగురు ఒకేషనల్ పరీక్ష రాశారన్నారని, డీవోలుగా కేవీ సర్వేశ్వరరావు, ఎ.దుర్గాప్రసాద్ విధులు నిర్వహించారని హేమ చెప్పారు.

నేడు జనసైనికుల మౌనపోరాటం

కడియం, మార్చి 1: రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే సీటు కందుల దుర్గేష్‌కు కేటాయించాలని కోరుతూ శనివారం వేమగిరిలో మౌనపోరాటం, కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించనున్నట్టు జనసేన నాయకులు తెలిపారు. వేమగిరి జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న ఖాళీ ప్రదేశంలో మౌనపోరాటం, తదుపరి కొవ్వొత్తుల ర్యాలీ జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమం లో నియోజకవర్గంలోని జనసైనికులు, వీరమహిళలు పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

వ్యాసరచనలో ప్రసన్నకు ప్రథమ స్థానం



రంగంపేట, మార్చి 1: ఆదికవి నన్నయ యూనివర్సిటీలో పీజీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న రంగంపేటకు చెందిన బర్లంకి ఎస్వీ ప్రసన్న అభివృద్ధి చెందిన భారతదేశం కోసం దేశీయ సాంకేతికతలు అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ప్రథమ బహుమతి సాధించింది. అలాగే జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో స్కిట్ ప్రదర్శనలో కూడా ప్రథమ బహుమతి సాధించింది. ఈ సందర్భంగా శుక్రవారం జరిగిన సభలో ఆచార్య పద్మరాజు, ముఖ్యతిథి వీవీఎస్ కృష్ణమూర్తి చేతులమీదుగా సర్టిఫికెట్, జ్ఞాపికను అందుకుంది. ఈ సందర్భంగా ప్రసన్నను సహచర విద్యార్థులతోపాటు గ్రామస్థులు అభినందించారు.

'ఆదర్శ'లో ప్రాంగణ ఎంపికలు

గోకవరం, మార్చి1: మండలంలోని కొత్తపల్లిలో ఆదర్శ ఫార్మసీ కళాశాల్లో శుక్రవారం ప్రాంగణ ఎంపికలు జరిగాయి. కళాశాల చైర్మన్ ప్రగళ్ళపాటి కనకరాజు పర్యవేక్షణలో నాలుగో సంవత్సరం బి-ఫార్మసీ, రెండో సంవత్సరం డి-ఫార్మసీ విద్యార్థులకు గన్నవరంలోని ఇన్ఫో క్యూరీస్ కన్సల్టింగ్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ మోహన్ ఆధ్వర్యంలో ఈ ఎంపికలు జరిగాయి. ఎంపికల్లో 72 మంది విద్యార్థులు పాల్గొనగా పది మంది ఎంపికైనట్టు కళాశాల సెక్రటరీ నాగమణి తెలిపారు. కార్యక్రమంలో కళాశాల కోఆర్డినేటర్ ప్రగళ్లపాటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రధాన మంత్రి విశ్వకర్మ పథకంపై అవగాహన

రాజమహేంద్రవరం సిటీ, /రూరల్ మార్చి 1: ఎంఎస్ఎంఈ అభివృద్ధి ఫెసిలిటేషన్, భారత ప్రభుత్వం విశాఖపట్నం ఆధ్వర్యంలో జిల్లా పీఎమ్ విశ్వకర్మ పథకంపై శనివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఎంఎస్ఎంఈ అభివృద్ధి ఫెసిలిటేషన్ అధికారి జె.చంద్రమౌళి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ పథకంపై రాజమహేంద్రవరంలోని ఆర్‌కే కన్వెన్షన్‌లో శనివారం ఉదయం 9:30గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ప్రజలకు అవగాహన కల్పించనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ఆసక్తి గల వారి దరఖాస్తుల నమోదు ఉచితంగా చేస్తారని అందుకోసం ఆధార్ కార్డు, రేషన్ కార్డు, బ్యాంక్ ఖాతా పాస్‌బుక్ తీసుకుని రావాలని కోరారు.

సినిమా గైడ్

(రాజమహేంద్రవరం)

శ్యామల	: ఊరుపేరు భైరవకోన
సూర్యామినీ	: డూన్
సూర్యాప్యాలస్	: ఆపరేషన్ వాలెంటైన్
స్వామి	: ఆపరేషన్ వాలెంటైన్
శివజ్యోతి	: భూతద్దం, భాస్కర్ నారాయణ
అనుశ్రీ(సాయికృష్ణ)	: హనుమాన్
రాజా	: ఆపరేషన్ వాలెంటైన్
అశోక	: ------
ఊర్వశి	: సిద్ధార్థ్‌రాయ్
రంభ	: సుందరం మాస్టర్
మేనక	: కిక్
అప్సర	: ఆపరేషన్ వాలెంటైన్
కుమారి	: చారి 111
వీఎస్ మహాల్(నామవరం)	: ఆపరేషన్ వాలెంటైన్
మురళీకృష్ణ(ధవళేశ్వరం)	: ఆపరేషన్ వాలెంటైన్
వెంకటసూర్య(కడియం)	: ఆపరేషన్ వాలెంటైన్
సత్యగౌరి (అనపర్తి)	: హనుమాన్
సూర్యశ్రీ (అనపర్తి)	: ఊరుపేరు భైరవకోన
ఫార్చ్యూన్ సినిమాస్(రాజానగరం)	: ఆపరేషన్ వాలెంటైన్
రామకృష్ణ(కోరుకొండ)	: ఊరుపేరు భైరవకోన
గీతాసినిమాస్ (సీతానగరం)	: ఊరుపేరు భైరవకోన
శ్రీనివాస (గోకవరం)	: సైంధవ్
టీడీ సినీ మ్యాక్స్ (గోకవరం)	: ఊరుపేరు భైరవకోన
లలితామహాల్(రంపచోడవరం)	: ఆపరేషన్ వాలెంటైన్
నవయుగ(చింతూరు)	: ఆపరేషన్ వాలెంటైన్





చర్చ.. రచ్చ



రామవరంలో నల్లమిల్లిని అడ్డుకుంటున్న పోలీసులు.. తర్వాత వాహనంలో తరలింపు (కింద)



- అనపర్తిలో ఎమ్మెల్యే అవినీతిపై 'బహిరంగ చర్చ' రభస
- చర్చ జరగకుండానే ఇరు గ్రామాల్లో టీడీపీ, వైసీపీ బలప్రదర్శన
- మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లిని అడ్డుకున్న పోలీసులు, తోపులాట
- మూడున్నర గంటలపాటు పోలీసుల హైడ్రామా

తూర్పుగోదావరి జిల్లా అనపర్తి ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి చేసిన రూ.500 కోట్ల అవినీతి విషయమై బహిరంగ చర్చ కోసం టీడీపీ పట్టుబట్టడం, దానికి వైసీపీ ప్రతి సవాళ్లకు దిగడంతో అనపర్తి రాజకీయం వేడెక్కింది. ఈ క్రమంలో స్థానిక వైసీపీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అవినీతిపై టీడీపీ మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తొమ్మిది అంశాలతో కరపత్రం ముద్రించి పంపిణీ చేయడంతో ఇరు పార్టీల మధ్య మాటల యుద్ధం జరుగుతోంది. ఈ నేపథ్యంలో మార్చి 1న ఉదయం 11 గంటలకు ఎమ్మెల్యే ఇంటికి వెళ్లి, ఆయన అవినీతిపై బహిరంగ చర్చకు తాను సిద్ధంగా ఉంటానని మాజీ ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి సవాల్ చేయడంతో అనపర్తిలో టెన్షన్ నెలకొంది. శుక్రవారం ఉదయం అటు అనపర్తిలో ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, మండలంలోని తన స్వగ్రామం రామవరంలో మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డిలు బలప్రదర్శనతో సిద్ధంకావడంతో పోలీసులు రామకృష్ణారెడ్డిని అనపర్తికి వెళ్లకుండా అడ్డుకున్నారు. దీంతో పోలీసుల తీరుకు నిరసనగా నల్లమిల్లి రోడ్డుపై బైఠాయించడంతో పోలీసులకు, టీడీపీ శ్రేణులకు మధ్య తోపులాట జరిగింది. చివరకు పోలీసులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డిని అదుపులోకి తీసుకుని పోలీసు వాహనంలో తరలించారు. మూడున్నర గంటలపాటు నల్లమిల్లిని పోలీసులు రోడ్లపైనే తమ వాహనంలో తిప్పడంతో చివరకు కొవ్వూరులో టీడీపీ శ్రేణులు పోలీసు వాహనానికి తమ వాహనాలు అడ్డుపెట్టి వాగ్వివాదానికి దిగడంతో పోలీసులు అదే వాహనంలో రామకృష్ణారెడ్డిని తిరిగి రామవరంలోని ఆయన ఇంటి వద్ద దింపి వెనుదిరిగారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే తాను చేసిన అవినీతిపై చర్చించే ధైర్యం లేక పోలీసులను అడ్డుపెట్టుకుని చర్చలకు రాకుండా తనను కట్టడి చేశారని, దీంతో ఆయన తన అవినీతిని ఒప్పుకున్నట్టేనని అన్నారు. - అనపర్తి



ఉల్లిపాయల

ధరలకు రెక్కలు!

- విదేశాలకు ఎగుమతులతో దేశీయ మార్కెట్లపై ప్రభావం
- కూరగాయల ధరలు కూడా పైపైకి
- ధరలపై పెళ్లిళ్లు, ఫంక్షన్ల ప్రభావం

రాజమహేంద్రవరంఅర్బన్, మార్చి1: ఉల్లిపాయల ధరలకు మళ్లీ రెక్కలొస్తున్నాయి. నిన్నమొన్నటి వరకూ ఉల్లి ధరలు కాస్త తగ్గినట్టు కనిపించినా అది ఎంతోకాలం నిలవలేదు. మహారాష్ట్ర నుంచి కొత్త ఉల్లిపాయలు ఒకేసారి మార్కెట్లను ముంచెత్తడం, వివిధ రకాల నాణ్యతలు కలిగిన ఉల్లిపాయలు అందుబాటులోకి రావడంతో సామాన్యులు, మధ్యతరగతి వర్గాలు తమకు నచ్చిన క్వాలిటీని ఎంపిక చేసుకునేవారు. ఆటోల్లో ఇళ్ల దగ్గరకు తెచ్చి మరీ ఏడు కిలోలు రూ.100కు కూడా విక్రయించారు. రైతుబజార్లు, బహిరంగ చిల్లర మార్కెట్లలోనూ ధర కాస్త తక్కువగానే ఉండేది. కానీ ఇప్పుడు సీన్ మారుతోంది. ఇటీవల కేంద్ర ప్రభుత్వం ఉల్లి ఎగుమతులపై తాత్కాలికంగా నిషేధం ఎత్తివేయడంతో మహారాష్ట్ర నుంచి ఇతర దేశాలకు భారీగా ఎగుమతులు వెళ్లిపోతున్నాయి. ఫలితంగా దేశీయ మార్కెట్లోకి ఉల్లిలోడులు తక్కువగా వస్తున్నాయని, డిమాండ్‌కు అనుగుణంగా సరఫరా లేకపోవడంతో కొరత ఏర్పడి ధరల పెరుగుదలకు కారణంగా కనిపిస్తోందని ఇక్కడి వ్యాపారులు చెబుతున్నారు. మరోపక్క కూరగాయల ధరల్లోనూ పెరుగుదల నమోదవుతోంది. మాఘమాసంలో పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాలు పెద్దసంఖ్యలో జరుగుతుండడంతో కూరగాయల వినియోగం భారీగా పెరిగింది. దీంతో వ్యాపారులు ధరలు పెంచేశారు. అలాగే ఉష్ణోగ్రతల్లో వస్తున్న మార్పుల ప్రభావం కూరగాయల దిగుబడులపై పడుతోంది. దీంతో కూరగాయల ధరల్లో కొంత పెరుగుదల కనిపిస్తోంది. ముఖ్యంగా గత వారం రోజులుగా ఉల్లి ధరల్లో పెరుగుదల కనిపిస్తోంది. హోల్‌సేల్ మార్కెట్లో మంచి నాణ్యత కల్గిన ఉల్లిపాయలు కిలో రూ.26-రూ.28 ధర ఉంటే, ఇదే రకాన్ని బహిరంగ మార్కెట్లో రిటైల్ వ్యాపారులు రూ.30 నుంచి రూ.35ల వరకూ విక్రయిస్తున్నారు. రైతుబజార్లలో మొన్నటివరకూ కిలో రూ.20 ఉన్న ధర ఇప్పుడు రూ.24కు చేరింది. ఆటోల్లో ఇళ్ల దగ్గరకే తెచ్చి విక్రయించేవారు కూడా రూ.100కు ఐదు కిలోలు మించి ఇవ్వడంలేదు. క్వాలిటీ తక్కువగా ఉండే రకాలు మార్కెట్లోకి రాకపోవడం, మంచి రకాలు, నిల్వపాయలు ఎక్కువ రేటులో ఉండడంతో వీధుల్లో విక్రయించే చిల్లర వ్యాపారులు ఉల్లిపాయల జోలికి వెళ్లడం లేదు.

కూరగాయలదీ అదే దారి..

ఉల్లిపాయల బాటలోనే కూరగాయల ధరల్లోనూ పెరుగుదల కనిపిస్తోంది. ఒక్క టమోటా మినహా మిగిలిన అన్ని రకాల కూరగాయల ధరలు పెరిగాయి. బహిరంగ చిల్లర మార్కెట్లో దొమ్మేరు వంకాయలు కిలో రూ.80 వరకూ అమ్ముతున్నారు. బెండకాయలు రూ.50, పచ్చిమిర్చి రూ.60, కాకరకాయలు రూ.50, బీరకాయలు రూ.40, చిక్కుళ్లు రూ.80 వరకూ అమ్ముతున్నారు. రైతుబజార్లలో ధరలు పరిశీలిస్తే దొమ్మేరు వంకాయలు కిలో రూ.54, గులాబీ రకం రూ.44, తెలుపు రూ.38 ఉంది. రెండు వారాల వ్యవధిలోనే కిలోకు రూ.10 నుంచి రూ.15 వరకూ ధరలు పెరిగాయి. కాలీఫ్లవర్ పువ్వు రూ.25కు విక్రయిస్తున్నారు. ఇది రూ.12 నుంచి 15లకు దొరికేది. బెండకాయలు రూ.32, పచ్చిమిర్చి రూ.34, కాకరకాయ రూ.38, చిక్కుళ్లు రూ.54, చేమదుంపలు రూ.50, బీన్స్ రూ.60, ఆనబకాయ రూ.16.. ఇలా అన్ని రకాల కూరగాయల్లోనూ పెరుగుదల కనిపిస్తోంది. రైతుబజార్లతో పోల్చితే బహిరంగ మార్కెట్లలో ధరలు మరింత ఎక్కువగానే ఉంటాయి.

ధరలు మరింత పెరిగే అవకాశం

రాబోయే రోజుల్లో ఉల్లిపాయలు, కూరగాయల ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు చెబుతున్నారు. ఇతర దేశాలకు ఉల్లి ఎగుమతులపై మళ్లీ నిషేధం విధించినా ఉల్లిపాయల ధరలు ఇప్పట్లో తగ్గకపోవచ్చనే అంచనా వేస్తున్నారు. ఉల్లిపాయలు పాతబడితే వాటి నాణ్యత పెరుగుతుంది. నిల్వకు ఆగుతాయి. ఇలాంటి రకాలన్నీ కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేస్తారు. మంచి రేటు వచ్చాక బయటకు తీస్తారు. ఎగుమతులపై నిషేధం లేకపోతే క్వాలిటీ ఉల్లిపాయలను మంచిరేటుకు ఇతర దేశాలకు ఎగుమతి చేస్తారని, దేశీయమార్కెట్లో కొరత ఏర్పడి ధరలు పెరుగుతాయని హోల్‌సేల్ వ్యాపారులు చెబుతున్నారు. అలాగే, రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగితే ఆ ప్రభావం కూరగాయల సాగుపై పడుతుంది. దిగుబడులు లేకపోతే ఇతర ప్రాంతాల నుంచి కూరగాయలను తీసుకురావాల్సి ఉంటుంది. ఫలితంగా ధరలు మరింత పెరుగుతాయని కూరగాయల వ్యాపారులు చెబుతున్నారు. అటు ఉల్లిపాయలు, ఇటు కూరగాయలు సామాన్యులపై ధరల పంజా విసరబోతున్నాయనే చెప్పాలి.

రాజమహేంద్రవరం లోక్‌సభ ఉమ్మడి

అభ్యర్థి ఎవరో

- టీడీపీనా.. బీజేపీ కోటానా అంటూ చర్చ
- పలువురు ఆశావహుల ఎదురుచూపులు
- టీడీపీకి లోకసభ బలమైన నియోజకవర్గం
- రాష్ట్ర విభజన తర్వాత అత్యధిక మెజార్టీ సాధించిన ఘనత మురళీమోహన్‌దే
- 2014లో టీడీపీకి 14.29% ఓట్ల మెజారిటీ
- 2019లో వైసీపీకి 9.73% ఓట్ల మెజారిటీ
- గతంలో ఓట్ల చీలిక కారణంగానే నష్టం
- వైసీపీ నుంచి ఇప్పటికే డాక్టర్ గూడూరి
- ఉమ్మడి అభ్యర్థి కోసం సర్వత్రా ఆసక్తి

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో రాజమహేంద్రవరం లోక్‌సభ స్థానం నుంచి టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థి ఎవరనేది చర్చనీయాంశమైంది. టీడీపీ అభ్యర్థినే నిలబెడతారా, బీజేపీతో పొత్తు కుదిరితే ఆ పార్టీ అభ్యర్థిని నిలబెడతారా అనేది ప్రధాన చర్చ సాగుతోంది. రాజమహేంద్రవరం లోక్‌సభలో ద్విముఖ పోటీ మాత్రమే జరిగే అవకాశం ఉంది. ప్రధాన పార్టీలైన టీడీపీ, జనసేన ఒకవైపు, వైసీపీ మరొకవైపు పోటీచేయనుంది. బీజేపీ కూడా టీడీపీ-జనసేన పొత్తులో భాగస్వామ్యం కానున్నట్టు ప్రచారం జరుగుతోంది. అది ఖరారైతే ఈ మూడు పార్టీలు కలసి ఉమ్మడి అభ్యర్థిని బరిలో పెడతాయి. ఇదే జరిగితే ఉమ్మడి అభ్యర్థి బలం బాగా పెరిగినట్టే. వైసీపీ ఎంపీ మార్గాని భరత్‌ను సిటీ సమన్వయకర్తగా నియమించి, సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌ను లోక్‌సభ కోఆర్డినేటర్‌గా వైసీపీ అధిష్ఠానం నియమించిన సంగతి తెలిసిందే. ఆయనే లోక్‌సభ అభ్యర్థిగా ప్రచారం చేసుకుంటున్నారు. కానీ సమన్వయకర్తలంతా అభ్యర్థులు కాదని వైసీపీ ముఖ్యనేతలు చేస్తున్న ప్రకటనలతో కాస్త అయోమయం నెలకొంది. కానీ డాక్టర్ గూడూరి శ్రీనివాసే వైసీపీ లోక్‌సభ అభ్యర్థి అని పార్టీ వర్గాలు ప్రచారం చేసుకుంటున్నాయి. ఇక ఉమ్మడి అభ్యర్థి ఎవరనేది ఇంకా తేలలేదు. టీడీపీ అభ్యర్థినే ఉమ్మడి అభ్యర్థిగా పోటీపెడితే గుడా మాజీ ఛైర్మన్, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ తనకు అవకాశం ఇవ్వాలని ఇప్పటికే టీడీపీ అధినేత చంద్రబాబుకు లేఖ రాసిన సంగతి తెలిసిందే. ఆయన లోక్‌సభ టిక్కెట్ ఆశిస్తుండగా, రాజానగరం ఎమ్మెల్యే టిక్కెట్ ఆశించిన రాజానగరం టీడీపీ ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణ కూడా టిక్కెట్ ఆశిస్తున్నారు. 2014లో ఆయన వైసీపీ తరపున ఎంపీగా పోటీచేసిన అనుభవం కూడా ఉంది. ఇంకా మాజీ ఎంపీ కంభంపాటి రామ్మోహన్, శిష్టా లోహిత్, పార్టీ సమన్వయకర్త వై.రవి వంటి వారు కూడా టిక్కెట్ ఆశిస్తున్నారు. బీజేపీతో టీడీపీ-జనసేనకు పొత్తుకుదిరితే బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురంధేశ్వరి ఇక్కడి నుంచి పోటీ చేస్తారనే వాదన కూడా ఉంది. ఈ వారంలోగానీ, రెండోవారంలోగానీ అభ్యర్థిని ఖరారు చేసే అవకాశం ఉంది. జిల్లాలో ఏడు అసెంబ్లీ నియోజవర్గాలు ఉన్నాయి. ఇంతవరకూ మూడు చోట్ల అభ్యర్థులను ఖరారుచేశారు. రాజమహేంద్రవరం సిటీకి ఆదిరెడ్డి వాసు, అనపర్తికి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అభ్యర్థిత్వాలను ఖరారుచేయగా, రాజానగరం నుంచి జనసేన నేత బత్తుల బలరామకృష్ణను ఖరారు చేసిన సంగతి తెలిసిందే. ఇక రాజమహేంద్రవరం రూరల్‌ను ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, నిడదవోలు నుంచి జనసేన నేత కందుల దుర్గేష్‌ను ఖరారు చేస్తారనే ప్రచారం జరుగుతోంది. గోపాలపురం నుంచి మద్దిపాటి వెంకట్రాజు అభ్యర్థిత్వం ఖరారైనట్టే. ఇక అధికారికంగా ప్రకటించడమే తరువాయి. కొవ్వూరులో ఇంకా అస్పష్టత కొనసాగుతోంది. వైసీపీలో రాజమహేంద్రవరం సిటీ నుంచి ఎంపీ మార్గాని భరత్, రూరల్ నుంచి మంత్రి చెల్లుబోయిన వేణు, కొవ్వూరు నుంచి గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, గోపాలపురం నుంచి మంత్రి తానేటి వనితలను సమన్వయకర్తలుగా నియమించిన సంగతి తెలిసిందే. మరో మూడు చోట్ల అంటే రాజానగరం, అనపర్తి, నిడదవోలులో సమన్వయకర్తల నియామకం జరగవలసి ఉంది. ప్రధాన పార్టీలన్నింటిలో అభ్యర్థులు ఖరారు కాని చోట్ల అటు ఆశావహుల్లోను, అయా పార్టీల కేడర్‌లోనూ పడుతున్నారు.

ఉమ్మడి అభ్యర్థిపైనే అందరి చూపు

రాజమహేంద్రవరం లోక్‌సభ స్థానం గోదావరికి అటూఇటూ ఉన్న ప్రాంతం. ఈ స్థానం టీడీపీకి కంచుకోట. పోల్ మేనేజ్‌మెంట్, వర్గాల సమీకరణ వ్యూహాత్మకంగా ఉంటే టీడీపీ నుంచి ఈ స్థానాన్ని ఎవరూ తన్నుకుపోలేనంత కేడర్ టీడీపీకి ఉంది. తెలుగుదేశం పార్టీ ఏర్పడిన తర్వాత 1984 నుంచి 2019 వరకూ జరిగిన పది లోక్‌సభ ఎన్నికలలో టీడీపీ మూడుసార్లు, బీజేపీ రెండుసార్లు, కాంగ్రెస్ నాలుగుసార్లు, వైసీపీ ఒకసారి గెలిచింది. కానీ గెలిచిన ప్రతీసారీ ఓట్ల శాతం పరిశీలించినా, మెజార్టీ శాతం పరిశీలించినా టీడీపీకే అధికంగా ఓట్లు తెచ్చుకోవడం గమనార్హం. రాష్ట్ర విభజన తర్వాత మొదటగా జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో రాజమహేంద్రవరం లోక్‌సభ స్థానం నుంచి ప్రముఖ సినీనటుడు మాగంటి మురళీమోహన్ ఘనవిజయం సాధించారు. అప్పట్లో 6,30,573 ఓట్లు అంటే 54.62 శాతం ఓట్లు సాధించారు. అంతకుముందు జరిగిన ఎన్నికలకంటే అదనంగా 19.72 శాతం సాధించారు. 2009 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి ఉండవల్లి అరుణకుమార్ చేతిలో కేవలం 2,147 ఓట్ల తేడాతో మురళీమోహన్ ఓడిపోయిన సంగతి తెలిసిందే. కానీ 2014లో జరిగిన ఎన్నికల్లో ఇంత వరకూ ఎవరికీ రానంత మెజారిటీ ఆయనకు వచ్చింది. ఏకంగా 1,67,434 ఓట్ల మెజారిటీ లభించింది. ఇది 14.29 శాతం మెజారిటీ. అప్పట్లో వైసీపీ తరపున పోటీ చేసిన బొడ్డు వెంకటరమణకు 4,63,139 ఓట్లు వచ్చాయి. అది 40.12 శాతం. కానీ 2019లో తెలుగుదేశం, జనసేన వేర్వేరుగా పోటీచేసి దెబ్బతిన్నాయి. టీడీపీ తరపున మాగంటి మురళీమోహన్ కోడలు మాగంటి రూప పోటీ చేసి 4,60,390 ఓట్లు అంటే 36.82 శాతం తెచ్చుకోగలిగారు. జనసేన అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే ఆకుల సత్యనారాయణ పోటీచేసి 1,55,807 ఓట్లు అంటే 12.46 శాతం సాధించారు. ఈ ఇద్దరి మధ్య ఓట్లు చీలిపోవడంతో వైసీపీ అభ్యర్థి మార్గాని భరత్ 5,82,024 ఓట్లు అంటే 46.55 శాతం ఓట్లు సాధించి, 1,21,634 ఓట్లు మెజార్టీ సాధించారు. ఇది 9.73 శాతం మెజార్టీ.. ఈసారి ఈ లెక్కలే కాక, అధికార పార్టీ మీద ఉన్న ప్రజల్లో వ్యతిరేకత, టీడీపీ, జనసేన ఐక్యత వల్ల ఉమ్మడి అభ్యర్థికే విజయావకాశాలు ఉంటాయని అంచనా వేస్తున్నారు.



రాజమహేంద్రవరం ఏకేసీ కాలేజీ వద్ద ఇంటర్ విద్యార్థుల సందడి





పరీక్ష సమయం దగ్గరపడడంతో పరుగులు తీస్తున్న విద్యార్థులు

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు ప్రారంభం

- మూడు జిల్లాలో 2,550 మంది విద్యార్థులు గైర్హాజరు
- తూర్పుగోదావరిలో జనరల్ 19,309 మంది, ఒకేషనల్ విభాగంలో 1851 మంది హాజరు
- పలుచోట్ల అసౌకర్యాలతో విద్యార్థుల ఇక్కట్లు
- సీలింగ్ ఫ్యాన్లు పనిచేయక ఎండ వేడిమికి మరిన్ని అవస్థలు

ఎన్నికల లెక్కింపు కేంద్రం పరిశీలన



నన్నయ వర్సిటీ ప్రాంగణంలో ముందస్తు ఎన్నికల ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

దివాన్‌చెరువు, మార్చి1: ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ప్రాంగణంలో రిసెప్షన్ కేంద్రాన్ని, అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా స్ట్రాంగ్‌రూమ్‌లు, లెక్కింపు కేంద్రాలను కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కె.మాధవీలత శుక్రవారం పరిశీలించారు. ఎస్పీ పి.జగదీష్, నియోజకవర్గాల ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, ఎన్నికల అధికారులతో కలసి కలెక్టర్ ముందస్తు ఏర్పాట్లను, రోడ్ మ్యాప్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ అనంతరం ఏడు నియోజకవర్గాలవారీగా బ్యాలెట్ యూనిట్లు అత్యంత భద్రత మధ్య నన్నయ విశ్వవిద్యాలయానికి తీసుకువచ్చి ఆయా నియోజకవర్గాలకు కేటాయించిన స్ట్రాంగ్‌రూమ్‌లకు చేర్చడం జరుగుతుందన్నారు. లెక్కింపు జరిపేరోజు దాకా ఏఏ పనులు చేపట్టాలనే అంశంపై రోడ్‌మ్యాప్ సిద్ధం చేసుకుని ట్రైల్ నిర్వహించాలని, రిసెప్షన్ కేంద్రం నుంచి స్ట్రాంగ్‌రూమ్‌కు అక్కడి నుంచి లెక్కింపు జరిపే రోజున నియోజకవర్గం లెక్కింపు కేంద్రానికి తదుపరి స్ట్రాంగ్‌రూమ్‌కు చేరేవరకూ తీసుకునే చర్యలపై నివేదిక అందజేయాలని ఆదేశించారు. నన్నయ ప్రాంగణంలో రిసెప్షన్ కేంద్రం, స్ట్రాంగ్ రూమ్‌లు, లెక్కింపు కేంద్రాలు, స్టాట్యూటరీ, నాన్ స్టాట్యూటరీ ఫార్మ్స్ భద్రపరచడం కోసం అవసరమైన అన్ని చర్యలు క్షేత్రస్థాయిలో పరిశీలించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. ఎస్పీ పి.జగదీష్ మాట్లాడుతూ మూడంచెల భద్రత ఏర్పాట్లు చేస్తున్నట్టు వివరించారు. కలెక్టర్ వెంట రాజమహేంద్రవరం రూరల్ ఆర్వో, జేసీ ఎన్.తేజ్ భరత్, రాజమహేంద్రవరం అర్బన్ ఆర్వో, నగరపాలక సంస్థ కమిషనర్ కె.దినేష్‌కుమార్, కొవ్వూరు ఆర్వో, సబ్‌కలెక్టర్ అశుతోష్‌శ్రీవాత్సవ్, డీఆర్వో జి.నరసింహులు, రాజానగరం ఆర్వో, రాజమహేంద్రవరం ఆర్డీవో ఏ.చైత్రవర్షిణి, ఓఎన్జీసీ ఎస్‌డీసీ కేఎల్ శివజ్యోతి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (గెయిల్), అనపర్తి ఆర్వో ఎం.మాధురి, పీబీపీ ఆర్ఎంసీ యూనిట్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, నిడదవోలు ఆర్వో ఆర్‌వీ రమణనాయక్, కేఆర్ ఆర్‌సీ ఎస్‌డీసీ ఆర్.కృష్ణనాయక్, ఎస్‌బీ డీఎస్పీ డి.ప్రభాకర్ పాల్గొన్నారు.

మార్గదర్శకాల ప్రకారం ఎన్నికల శిక్షణ పూర్తి

రాజమహేంద్రవరం సిటీ/రూరల్, మార్చి1: ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం వివిధ బృందాలకు శిక్షణ కార్యక్రమం పూర్తిచేశామని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ కె.మాధవీలత తెలిపారు. శుక్రవారం సాయంత్రం వెలగపూడి నుంచి రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్‌కుమార్‌మీనా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న జిల్లా కలెక్టర్లతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌లో మన జిల్లా నుంచి కలెక్టర్ కే మాధవీలత ఎన్నికల ఏర్పాట్లను వివరించారు.



విద్యార్థులు గల్లంతైన హాస్టల్

ఎస్సీ హాస్టళ్ల విద్యార్థుల

భద్రత గాలికి..

- పారిపోతున్న విద్యార్థులు, పది రోజుల్లో ముగ్గురు అదృశ్యం
- పోలీసులకు ఫిర్యాదు చేసి చేతులు దులిపేసుకుంటున్న వైనం
- సాంఘిక సంక్షేమశాఖ అధికారులు, వార్డెన్ల తీరుపై విమర్శలు

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి1: ఎస్సీ హాస్టళ్లలో చదువుతున్న విద్యార్థుల భద్రత విషయంలో జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అధికారులు తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఎక్కడెక్కడి నుంచో వచ్చి తల్లిదండ్రులకు దూరంగా హాస్టళ్లలో ఉంటూ చదువుకుంటున్న విద్యార్థుల బాగోగుల విషయంలో హాస్టల్ వెల్ఫేర్ అధికారులు (వార్డెన్లు) చాలా ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారంటూ విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పది రోజుల కిందట రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల సమీపంలోని సాంఘిక సంక్షేమబాలుర వసతిగృహం నెంబర్-1 హాస్టల్ నుంచి 7వ తరగతి చదువుతున్న విద్యార్థి ఒకరు పారిపోగా, రెండు రోజుల కిందట ఇదే హాస్టల్‌లో 9వ తరగతి చదువుతున్న మరో ఇద్దరు విద్యార్థులు కూడా పారిపోవడం ఆందోళన కల్గిస్తోంది. అయితే 9వ తరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థులు శుక్రవారం రాజమహేంద్రవరం రైల్వేస్టేషన్‌లో పోలీసులకు దొరకడంతో వారిని తీసుకొచ్చి వారి తల్లిదండ్రులకు అప్పగించారు. వీరిద్దరూ రైలెక్కి సికింద్రాబాద్ వెళ్లి తిరిగి వచ్చేసినట్టు ప్రచారం జరుగుతోంది. పెద్దాపురంనకు చెందిన 7వ తరగతి విద్యార్థి ఆచూకీ దొరకలేదు. ఒకే హాస్టల్‌లో చదువుతున్న ముగ్గురు విద్యార్థులు స్కూల్ నుంచి పారిపోవడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఇదిలా ఉంటే, మూడు నెలల కిందట గణేష్‌చౌక్ సమీపంలోని ఎస్సీ బాలికల హాస్టల్‌లో చదువుతున్న ఒక బాలిక మూడు రోజులపాటు అదృశ్యమైంది. పోలీసులు దీనిపై తమదైన శైలిలో గట్టిగా దృష్టిపెట్టడంతో కుటుంబ వివాదాల నేపథ్యంలో ఆ బాలికను తండ్రే స్కూల్ నుంచి ఇంటికి తీసుకెళ్లినట్టు తేలింది. ఇలాంటి సంఘటనలు చోటుచేసుకున్నప్పుడు బాలికలకు వైద్యపరీక్షలు చేయించాలనే నిబంధన ఉన్నా హాస్టల్ అధికారులు దాన్ని నిర్లక్ష్యంగా వదిలేశారని తెలిసింది. అలాగే రెండువారాల కిందట బీసీ బాలుర హాస్టల్‌లో 10వ తరగతి చదివే విద్యార్థి పారిపోయాడు. ఇతని ఆచూకీ కూడా దొరకలేదు. హాస్టళ్లలో చదువుకుంటున్న విద్యార్థినీవిద్యార్థుల భద్రతతోపాటు వారి బాగోగులను హాస్టల్ వెల్ఫేర్ అధికారులు (వార్డెన్లు) పూర్తిస్థాయిలో పట్టించుకోవాల్సి ఉంటుంది. ప్రధానంగా బాలికల హాస్టల్స్‌లోని విద్యార్థినిలపై మరింత శ్రద్ధ పెట్టాల్సి ఉన్నా అలా జరగడం లేదని చెబుతున్నారు. అమ్మాయిల హాస్టళ్లకు చెందిన కొందరు మహిళా వార్డెన్ల పనితీరు, ఇతర విషయాలపై జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెళ్లినా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం సాంఘిక సంక్షేమశాఖ ఉద్యోగుల్లో చర్చనీయాంశంగా మారింది. ఇక టెన్త్ వరకూ విద్యార్థులను ఉదయం హాస్టల్ నుంచి స్కూల్ వరకూ తీసుకెళ్లడం, మళ్లీ సాయంత్రం స్కూల్ నుంచి హాస్టల్ వరకూ తీసుకురావడం చేయాల్సి ఉంటుంది. ఇక్కడి ఎస్సీ హాస్టళ్లలో అలాంటి పరిస్థితులు కనిపించడంలేదనే చెప్పాలి. జిల్లా సాంఘిక సంక్షేమాధికారి కార్యాలయం రాజమహేంద్రవరంలోనే ఉంది. రాజానగరం ఏఎస్‌డబ్ల్యువోగా పనిచేస్తున్న సందీప్‌కు డీఎస్‌డబ్ల్యువో ఎఫ్ఏసీగా బాధ్యతలు అప్పగించి నియమించారు. రెగ్యులర్ డీఎస్‌డబ్ల్యువో కాకపోవడంతో ఆయన జిల్లాలోని హాస్టళ్లపై పెద్దగా దృష్టి పెట్టడంలేదని చెబుతున్నారు. రాజమహేంద్రవరంలోనే ఏఎస్‌డబ్ల్యువో ఉన్నా హాస్టళ్లను సందర్శించడం తక్కువే అని చెబుతుంటారు. ఆయా విషయాలపై వివరణ కోరగా హాస్టల్స్‌లో చదువుకుంటున్న విద్యార్థులు స్కూల్ నుంచి పారిపోతే తమకేంటి సంబంధం అంటూ రాజమహేంద్రవరం ఏఎస్‌డబ్ల్యువో ప్రసాద్ పేర్కొన్నారు. పిల్లలకు హాస్టల్‌లో ఉండడం ఇష్టంలేదని, చదవమన్నా తప్పులా ఉంటున్నదని అన్నారు. హాస్టల్ పిల్లలకు తాము ఏమీ చెప్పలేకపోతున్నామని వ్యాఖ్యానించారు. స్కూల్ నుంచి ఎలాంటి అజమాయిషీ లేదన్నారు. పారిపోయిన పిల్లవాడి కోసం వెతుకుతున్నాం అని తెలిపారు.

సౌత్ జోన్ పరిధిలో సెక్షన్ 30 పొడిగింపు

రాజమహేంద్రవరం, మార్చి 1(ఆంధ్రజ్యోతి): సౌత్ జోన్ పరిధిలోని టూటౌన్, ధవళేశ్వరం, కడియం పోలీస్‌స్టేషన్ల పరిధిలో పోలీస్ చట్టంలోని సెక్షన్ 30 విధించిన విషయం తెలిసిందే. అయితే ఈ విధింపును ఈనెల 31 వరకూ పొడిగిస్తున్నట్టు డీఎస్పీ ఎం.అంబికాప్రసాద్ తెలిపారు. తమ నుంచి ముందస్తుగా అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, ఊరేగింపులు వంటివి జరపడానికి వీల్లేదని ఆయన పేర్కొన్నారు. ఉత్తర్వులను ఉల్లంఘిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని డీఎస్పీ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

విద్యా దీవెన రూ.24 కోట్లు జమ : కలెక్టర్ మాధవీలత

రాజమహేంద్రవరం, మార్చి 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలో విద్యాదీవెన పథకం కింద 2023-24 ఏడాదికి సంబంధించి 31,926 మంది విద్యార్థుల నిమిత్తం 28,730 మంది తల్లుల బ్యాంకు ఖాతాలో రూ.24,09,39,718 మొదటి విడతగా జమ చేశామని జిల్లా కలెక్టర్ డా.కే.మాధవీలత ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

తూర్పుగోదావరి
• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి
• కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలి:ఎస్పీ



జగన్నాథపురం బోర్డరులో అంతర్ జిల్లాల చెక్‌పోస్టు పరిశీలిస్తున్న ఎస్పీ జగదీష్

గోపాలపురం, మార్చి 1: విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ పి.జగదీష్ పోలీసులకు సూచించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గోపాలపురం నియోజకవర్గం బోర్డర్‌లో అంతర్‌జిల్లాల చెక్‌పోస్టును ఆయన శుక్రవారం తనిఖీ చేశారు. అనంతరం నియోజకవర్గ ముఖ్య కేంద్రమైన గోపాలపురంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి నామినేషన్ల స్వీకరణ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఐ సతీష్‌కుమార్‌కు పలు సూచనలు చేశారు.

కొవ్వూరు మున్సిపల్ కమిషనర్‌గా జోసఫ్



కొవ్వూరు, మార్చి 1: కొవ్వూరు మున్సిపల్ కమిషనర్‌గా కె.డానియల్ జోసఫ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకూ ఇక్కడ పనిచేసిన బి.శ్రీకాంత్ బాపట్ల మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ప్రొద్దుటూరు మున్సిపాల్టీలో రెవెన్యూ ఆఫీసర్‌గా పనిచేస్తున్న కె.డానియల్ జోసఫ్‌ను నియమితులయ్యారు. కొవ్వూరు కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన జోసఫ్‌కు మేనేజర్ జి.రాధాకృష్ణ, టీపీవో శ్రీధర్, ఏఈలు పి.దుర్గాకిషోర్, సుమంత్, కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు.

నిడదవోలు కమిషనర్‌గా రామ్‌భూపాల్ రెడ్డి



నిడదవోలు, మార్చి 1: నిడదవోలు పురపాలక సంఘానికి రేపల్లె పురపాలక సంఘం నుంచి బదిలీపై వచ్చిన రామ్‌భూపాల్‌రెడ్డి మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు నిడదవోలులో కమిషనర్‌గా పనిచేసిన కోనా శ్రీనివాస్ పార్వతీపురం మున్సిపల్ కమిషనర్‌గా బదిలీపై వెళ్లారు.

ఏబీఎన్ డిగ్రీ కళాశాలలో క్యాంపస్ ఇంటర్వ్యూలు

కొవ్వూరు, మార్చి 1: కొవ్వూరులోని ఏబీఎన్, పీఆర్ఆర్ డిగ్రీ కళాశాలలో విశాఖపట్నం లారెస్ ల్యాబ్ ఆధ్వర్యంలో శుక్రవారం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. లారెస్ ల్యాబ్ హెచ్ఆర్ ప్రతినిధి ఎం.ప్రకాష్ మాట్లాడుతూ బీఎస్సీ, ఎమ్మెస్సీ కెమిస్ట్రీ, ఎం ఫార్మసీ, బీ ఫార్మసీ, డిప్లమో మెకానికల్, ఎలక్ట్రికల్ ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ నందిగం వెంకట సుబ్బారావు, ప్రాంగణ ఎంపికల అధికారి కె.సూరిబాబు, పీజీ డైరెక్టర్ సీహెచ్ చలపతిరావు, వైస్ ప్రిన్సిపాల్ వై.రమేష్, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

పంట నమోదులో అభ్యంతరాలుంటే చెప్పండి

కొవ్వూరు వ్యవసాయాధికారి గంగాధర్

కొవ్వూరు, మార్చి 1: పంట నమోదు ప్రక్రియలో అభ్యంతరాలుంటే రైతులు గ్రామస్థాయిలో వ్యవసాయ సహాయకులను(వీఏవో) సంప్రదించాలని కొవ్వూరు మండల వ్యవసాయాధికారి ఎ.గంగాధర్ తెలిపారు. మండలంలో రబీ పంట నమోదు కార్యక్రమం ఫిబ్రవరి 29వ తేదీతో ముగిసిందని, దీని ఆధారంగా ధాన్యం కొనుగోలు, పంట నష్టం అంచనాలు తయారు చేయడం, క్రాప్ ఇన్సూరెన్సూ చేస్తారన్నారు. మార్చి 1 నుంచి 3వ తేదీ వరకు పంట నమోదు చేసిన రైతుల వివరాలను ఆర్బీకేలలో ప్రదర్శిస్తారని, పంటనమోదులో ఏమైనా అభ్యంతరాలుంటే వీఏవోలకు తెలియజేయాలని చెప్పారు.

సచివాలయ భవనం ప్రారంభం

కొవ్వూరు, మార్చి 1: సచివాలయాల ద్వారా గ్రామ పరిపాలనను ప్రజల చెంతకు తీసుకొచ్చామని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. కొవ్వూరు మండలం ఆరికిరేవులలో నిర్మించిన సచివాలయ భవనాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ మట్టా శ్రీను, ఎంపీడీవో కె.సుశీల, అల్లు శ్రీను, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

నిడదవోలు ప్రభుత్వ కళాశాలకు నాక్ బి ప్లస్

నిడదవోలు, మార్చి 1: నిడదవోలులోని ఎస్వీఆర్కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు నాక్ బృందం బి ప్లస్ గ్రేడ్‌ను ప్రదానం చేసినట్టు ప్రిన్సిపాల్ కె.జ్యోతి శుక్రవారం తెలిపారు. ఫిబ్రవరి 19, 20 తేదీల్లో నాక్ బృందానికి చైర్మన్‌గా ప్రొఫెసర్ వినోద్ కుమార్ గార్గ్, సభ్యులుగా ప్రొఫెసర్ రామనాగరాజు పిళ్లై, డాక్టర్ అశోక్‌కుమార్ కళాశాలను సందర్శించారు. కళాశాల బోధనా వసతులు, మౌలిక సదుపాయాలు, విద్యారంగంలో సాధించిన ప్రగతిని కూలంకషంగా పరిశీలించారు. అనంతరం బి ప్లస్ గ్రేడ్‌ను ప్రదానం చేశారు. ఈ గ్రేడ్ పట్ల కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర బృందం, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

పశ్చిమబెంగాల్‌లో మహిళలపై దాడులు అరికట్టాలి

నిడదవోలు, మార్చి 1: పశ్చిమ బెంగాల్‌లో మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, దాడులను అరికట్టాలని, అఘాయిత్యాలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని బీజేపీ పట్టణాధ్యక్షుడు నీలం రామారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు నిడదవోలు తహశీల్దార్ కార్యాలయం వద్ద పార్టీ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బండి సత్యనారాయణ, మండలాధ్యక్షుడు మాట్ల దుర్గారావు (చిన్ని), బాబీ, టి.నాగేశ్వరరావు, పినిశెట్టి సూర్యచంద్రదరావు, కట్టుంగ అచ్చయ్య పాల్గొన్నారు.

పల్స్‌పోలియోపై అవగాహన ర్యాలీ

చాగల్లు, మార్చి 1: ఈ నెల 3వ తేదీన జరిగే జాతీయ పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ మండలంలోని బ్రాహ్మణగూడెంలో శుక్రవారం అవగాహన ర్యాలీ జరిపారు. స్థానిక పీహెచ్‌సీ పరిధిలోని ఆరోగ్య సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఐదేళ్ల లోపు పిల్లలందరికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలన్నారు. స్థానిక జడ్పీ హైస్కూల్ విద్యార్థులతో నిర్వహించిన ఈ ర్యాలీలో పలువురు పీహెచ్‌సీ డాక్టర్లు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి ఉపకరణాల అందజేత

దేవరపల్లి, మార్చి 1: మండలం కృష్ణపాలెంలో బీఆర్ అంబేడ్కర్ మెమోరియల్ ట్రస్ట్ వృద్ధాశ్రమానికి నల్లజర్ల మండలం పోతవరం గ్రామానికి చెందిన గంటా దిలీప్ రిఫ్రిజిరేటర్, వన్‌హెచ్‌బీ మోటార్‌ను ఆశ్రమ చైర్‌పర్సన్ శ్యామలాదేవికి అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పెనుమత్స సుబ్బరాజు, ప్రత్తిపాటి హరినాథ్ పాల్గొన్నారు. అలాగే గొల్లగూడెం వృద్ధ, దివ్యాగ ఆశ్రమానికి భాష్యం స్కూల్ ప్రిన్సిపల్ పేరయ్యనాయుడు భాష్యం రామకృష్ణ పుట్టినరోజు సందర్భంగా నిత్యవసరాలు, పండ్లు, ఆహారపదార్థాలు అందజేశారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకుడు భాస్కరరావు, ఛాంప్స్ ప్రిన్సిపాల్ సభాన, ప పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న నలుగురి అరెస్టు

గోపాలపురం, మార్చి 1: గంజాయి తరలిస్తున్న నలుగురు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. సీఐ బాలసురేష్‌బాబు వివరాల మేరకు మండలంలోని జగన్నాథపురం శివారులో ఏర్పాటు చేసిన అంతర్‌జిల్లాల చెక్‌పోస్టు వద్ద రెవెన్యూ సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో విశాఖ జిల్లా నుంచి కర్ణాటక రాష్ట్రానికి చెందిన ఇద్దరు వ్యక్తులు రెండు బ్యాగుల్లో నాలుగున్న కిలోల గంజాయిని తరలిస్తుండగా పట్టుబడ్డారు. ఇద్దరినీ అదుపులోకి తీసుకుని గంజాయి స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. తనిఖీల్లో ఎస్ఐ సతీష్‌కుమార్, డీటీ ప్రదీప్, వీఆర్వోలు మురళీ, సత్యవతి ఉన్నారు.

పేకాడుతున్న ముగ్గురి అరెస్టు

చాగల్లు, మార్చి 1: మీనానగరం గ్రామశివార్లలో పేకాడుతున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్టు ఎస్ఐ పి.నాగరాజు శుక్రవారం తెలిపారు. వారి నుంచి రూ.4100 స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

అర్ధరాత్రి స్పోర్ట్స్ బైక్‌పై యువకుల హల్‌చల్



నిడదవోలు, మార్చి 1: నిడదవోలులోని బస్టాండ్ సెంటర్ సమీపంలో గురువారం అర్ధరాత్రి పలువురు యువకులు స్పోర్ట్స్ బైక్‌పై మితిమీరిన వేగంతో రాంగ్ రూట్‌లో వెళ్లి కరెంటు స్తంభంతోపాటు రెండు బైక్‌లను ఢీకొని తీవ్ర గాయాలయ్యారు. క్షతగాత్రులు స్థానిక గౌడవీధికి చెందిన యువకులని, వారిని రాజమహేంద్రవరం ఆసుపత్రికి తరలించినట్టు స్థానికులు తెలిపారు. దీనికి సంబంధించి ఎటువంటి పోలీసు కేసు నమోదు కాలేదు. పట్టణంలోని యర్నగూడెం రోడ్డులో రాత్రి 11గంటలు దాటిన తరువాత స్పోర్ట్స్ బైక్‌లపై యువత మితిమీరిన వేగంతో రైడింగ్ పందేలు నిర్వహిస్తున్నట్టు స్థానికులు ఆరోపిస్తున్నారు.

16న జాతీయ లోక్ అదాలత్

రాజమహేంద్రవరం, మార్చి 1(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల ప్రకారం ఈ నెల 9న జరగాల్సిన జాతీయ లోక్ అదాలత్ 16న నిర్వహించడం జరుగుతుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూష కుమారి తెలిపారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని అన్ని న్యాయస్థానాల్లో రాజీపడదగిన కేసులను పరిష్కరించుకోడానికి జాతీయ లోక్ అదాలత్‌ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.



కొవ్వూరు ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల వద్ద విద్యార్థులు



తాళ్లపూడి: వేగేశ్వరపురంలో కళాశాల వద్ద విద్యార్థులు

20 మంది గైర్హాజరు

- కొవ్వూరులో ప్రశాంతంగా ఇంటర్మీడియట్ పరీక్షలు
- మొదటి రోజు ఫస్టియర్ పరీక్షకు 456 మంది హాజరు



నిడదవోలులో పరీక్ష కేంద్రానికి వెళ్తున్న విద్యార్థినులు

కొవ్వూరు, మార్చి 1: జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. శుక్రవారం ఫస్టియర్ విద్యార్థులకు నిర్వహించిన పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. కొవ్వూరు పట్టణ, మండలంలో 476 మంది విద్యార్థుకు గాను 456 మంది హాజరయ్యారు కాగా 20 మంది గైర్హాజరయ్యారు. మొదటిరోజు సీసీ కెమెరాల పర్యవేక్షణలో, పోలీసు బందోబస్తు మధ్య పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగాయి. ఉదయం 8:30గంటలకు విద్యార్థులను తనిఖీ చేసి పరీక్ష హాలులోకి పంపించారు. కొవ్వూరు ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో 307మందికి గాను 298 మంది, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో 169 మందికి గాను 158 మందికి హాజరయ్యారు.

గోపాలపురం: గోపాలపురంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో జరిగిన పరీక్షకు 537మంది విద్యార్థులకు గాను 521 మంది హాజరైనట్టు చీఫ్ సూపరిండెంటెండ్ ఉమాదేవి, డిపార్టుమెంటల్ ఆఫీసర్లు సాంబశివరావు, రత్నరాజు తెలిపారు. అలాగే గౌతమి జూనియర్ కాలేజీలో నిర్వహించిన పరీక్షకు 395మందికి గాను 374మంది హాజరైనట్టు చీఫ్ సూపరిండెంటెండ్ రమణ, డిపార్టుమెంటల్ ఆఫీసర్ దుర్గారావు తెలిపారు.

తాళ్లపూడి: మండలంలోని వేగేశ్వరపురం జూనియర్ కళాశాల నిర్వహించిన పరీక్షకు 215 మంది విద్యార్థులకు గానూ 204 మంది హాజరయ్యారని ప్రిన్సిపాల్ గౌరీనాథ్ తెలిపారు. కాగా వేగేశ్వరపురం జూనియర్ కళాశాల కేంద్రంగా సదరు కాలేజీతోపాటు మండలంలోని తాళ్లపూడిలో కరిబండి కళాశాల, అన్నదేవరపేటలోని హైస్కూల్ ప్లస్, విశ్వాసం ఒకేషనల్ కళాశల విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు.

నిడదవోలు: నిడదవోలులో ఇంటర్మీడియట్ ఫస్టియర్ విద్యార్థులకు మొదటి రోజు తెలుగు, సంస్కృతం పరీక్షలు నిర్వహించారు. పరీక్షలకు మొదటి రోజు కావడంతో విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు పరీక్షా కేంద్రాల వద్దకు వచ్చారు. సెంటర్ల వద్ద పోలీసులు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు.

చాగల్లు: మండల కేంద్రమైన చాగల్లు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జంబ్లింగ్ విధానంలో భాగంగా స్థానిక విద్యార్థులు నిడదవోలులోని పరీక్ష కేంద్రాలకు వెళ్లారు. స్థానిక పరీక్ష కేంద్రంలో 268 మంది హాజరు కావలసి ఉండగా ఒక్కరు గైర్హాజరైనట్టు ప్రిన్సిపాల్ పావని తెలిపారు.



గోపాలపురంలో పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థినులు



చాగల్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద విద్యార్థినులు

కార్పొరేట్‌కు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు

- హోం మంత్రి వనిత..పలు అభివృద్ధి పనులకు శ్రీకారం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తానేటి వనిత

దేవరపల్లి, మార్చి 1: ఇంగ్లీష్ మీడియం ప్రవేశపెట్టి కార్పొరేట్ స్కూల్స్‌కు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను తర్చిదిద్దారని హోం మంత్రి తానేటి వనిత అన్నారు. లక్ష్మీపురం, గౌరీపట్నం, దుద్దుకూరు, రామన్నపాలెం, ఆత్మీయ సమావేశాలు, అభివృద్ధి కార్యక్రమాలు శుక్రవారం చేపట్టారు. గౌరీపట్నంలో హెల్త్‌కేర్ సెంటర్, రైతు భరోసా కేంద్రాలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో 35లక్షల మందికి ఇళ్ల స్థలాలు అందజేశామని, రైతు సంక్షేమానికి ఆర్‌బీకే సెంటర్లు ఏర్పాటు చేశామన్నారు. లక్ష్మీపురంలో హరిహర క్షేత్రంలో మంత్రికి పూర్ణకుంభంతో స్వాగతం పలికి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం వేదపండితులు ఆశీర్వాదాలు అందజేశారు. కార్యక్రమంలో రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి గూడూరి శ్రీనివాసరావు, ఎంపీపీ కేవీకే దుర్గారావు, ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, లక్ష్మీపురం సర్పంచ్ ధనలక్ష్మి, దోనే జానకిరామ్, వైసీపీ కన్వీనర్ సతీష్, దుద్దుకూరు సర్పంచ్ బొంతా నాగమణి, కాండ్రు రామకృష్ణ, కార్యదర్శులు రవికిషోర్, రామచంద్రరావు, నాయకులు గడా జగదీష్, గడా రాంబాబు పాల్గొన్నారు.

క్షతగాత్రుడు ఆసుపత్రికి తరలింపు

మండల పర్యటనలో భాగంగా మంత్రి వనిత లక్ష్మీపురం నుంచి గౌరీపట్నం వెళ్తుండగా దుద్దుకూరు సమీపంలో దుద్దుకూరుకు చెందిన లింగాల వెంకట్రావు క్వారీలో పనిచేసే వ్యక్తి ద్విచక్రవాహనంపై జారిపడడంతో గాయాలయ్యాయి. దీంతో మంత్రి తన కాన్వాయ్‌ను ఆపి క్షతగాత్రున్ని పరామర్శించారు. అతడిని ఆసుపత్రికి తరలించి వైద్యం అందించాలని సిబ్బందిని ఆదేశించారు.

1214 మెమోను తక్షణం రద్దు చేయాలి

భవన నిర్మాణ కార్మికుల నిరసన దీక్ష



నిడదవోలులో నిరసన దీక్ష చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

నిడదవోలు, మార్చి 1: భవన నిర్మాణ కార్మికులు పోరాడి సాధించుకున్న సంక్షేమ బోర్డును రద్దు చేస్తూ వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన 1214 మెమోను తక్షణం రద్దు చేయాలని సంఘ గౌరవాధ్యక్షుడు జువ్వల రాంబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం నిడదవోలులోని మున్సిపల్ కార్యాలయం వద్ద నిడదవోలు, ఉండ్రాజవరం, పెరవలి మండలాల భవన నిర్మాణ కార్మికులు నిరసన దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షులు నిమ్మన శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వ పెద్దలు.. రాష్ట్రంలో నవరత్న పథకాలు అమలవుతున్నాయని, భవన నిర్మాణ కార్మికులకు ప్రత్యేకంగా పథకాలు అవసరం లేదని అనడం దారుణమన్నారు. తాపీ కార్మికుల సంఘం పట్టణాధ్యక్షుడు కారింకి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు నుంచి కార్మికులకున్న పథకాలను తక్షణం అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో పెండెం చినబాబు, కె.ప్రసాద్, గెడ్డం కుమార్, నాని, నరసింహారావు, దానమాల రాజు, నాగేశ్వరరావు తదితర్లు పాల్గొన్నారు.

ఐఎఫ్‌టీయూ నిరసన ప్రదర్శన

భవన నిర్మాణరంగ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో అభ్యుదయ పెయింటర్స్ అండ్ ఆర్టిస్ట్స్ యూనియన్ సభ్యులు నిడదవోలులో కార్మిక శాఖ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం కార్మికశాఖాధికారికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ నాయకులు ఈమని గ్రీష్మకుమార్, యల్లమిల్లి ప్రసన్న, గుంటు సూరిబాబు, యాదాల రమణ, రాజీవ్ పాల్గొన్నారు.

అవినీతిపరులకు కొమ్ముకాస్తున్న పోలీసులు

- రామకృష్ణారెడ్డి అక్రమ అరెస్టుపై మండిపడిన తెలుగు తమ్ముళ్లు
- అనపర్తి వైసీపీ ఎమ్మెల్యే అవినీతిపై నిగ్గుతేల్చాలని డిమాండ్



కొవ్వూరు గామన్‌బ్రిడ్జి వద్ద పోలీసులను అడ్డుకున్న టీడీపీ నాయకులు

కొవ్వూరు, మార్చి 1: అనపర్తి సంఘటన కొవ్వూరును కూడా తాకింది. అవినీతిపై గళమెత్తిన టీడీపీ నాయకులను అక్రమ అరెస్టులు చేసి రోడ్లపై కారులో తిప్పడం ఈ అరాచక ప్రభుత్వానికి అలవాటుగా మారింది. ఎన్నికల వేళ తాజాగా అనపర్తి మాజీ ఎమ్మెల్యే టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి శుక్రవారం ఉదయం అనపర్తిలో అదుపులోకి తీసుకుని సుమారు రెండు గంటలపాటు కారులో తిప్పుతూ చివరకు కొవ్వూరుకు తీసుకువచ్చారు. కొవ్వూరులో ఏ పోలీస్‌స్టేషన్‌లో ఉంచుతారోనని పోలీసులు, నాయకులు అంతా అప్రమత్తమయ్యారు. అయితే మధ్యలో ఏం జరిగిందో ఏమోగాని పోలీసులు రాజమహేంద్రవరం గామన్‌బ్రిడ్జిపై నుంచి కొవ్వూరు మీదుగా పంగిడి వైపు వెళ్లిపోయారు. కొంతదూరం వెళ్లిన తరువాత అక్కడ నుంచి వెనుదిరిగి వస్తుండగా గామన్‌బ్రిడ్జి టోల్‌గేట్ వద్ద కొవ్వూరు ద్విసభ్య కమిటీ సభ్యులు కంఠమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరిల ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు పోలీసుల వాహనాన్ని అడ్డుకున్నారు. తమ నాయకుడిని ఎందుకు అరెస్టుచేశారు, ఎక్కడికి తీసుకువెళ్తున్నారు, కారులో ఎందుకు తిప్పుతున్నారని డీఎస్పీని ప్రశ్నించారు. దీనికి డీఎస్పీ కేసు ఏం లేదని, ఇంటికి తీసుకువెళ్లి దింపుతామని చెప్పడంతో అయితే తన వాహనంలో తీసుకువెళ్తానని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కేఎస్ జవహర్ పట్టుపట్టారు. రామకృష్ణారెడ్డి పోలీసు కస్టడీలో ఉన్నందున తామే ఇంటివద్ద అప్పజెబుతామని డీఎస్పీ చెప్పారు. అయినా జవహర్ వినకుండా రామకృష్ణారెడ్డిని తరలిస్తున్న పోలీసు వాహనంలో ఎక్కి తానూ వస్తానంటూ పట్టుబట్టారు. ఈ సందర్భంగా కొవ్వూరు టీడీపీ ద్విసభ్య కమిటీ సభ్యులు కంఠమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి మాట్లాడుతూ అనపర్తి ప్రస్తుత వైసీపీ ఎమ్మెల్యే రూ.500 కోట్లు అవినీతికి పాల్పడ్డారని, దానిని నిరూపిస్తానని బయలుదేరిన రామకృష్ణారెడ్డిని ఏం జరిగిందని ఆలోచన చేయకుండా, మాజీ ఎమ్మెల్యే అని చూడకుండా అక్రమంగా అరెస్టు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అనంతరం అదే వాహనంలో రామకృష్ణారెడ్డిని అనపర్తి తరలించారు. కార్యక్రమంలో సూర్యదేవర రంజిత్, పొట్రు శ్రీనివాస్, కాగిత రఘు, బూరుగుపల్లి వీర రాఘవులు, కొత్తపల్లి ఆశిష్‌లాల్, జి.జి. చలం, వేమగిరి వెంకట్రావు, యనమదల శివరామకృష్ణ, కాకర్ల సత్యనారాయణ పాల్గొన్నారు.

గ్రామాల్లో అభివృద్ధి పనులకు ప్రాధాన్యం

ఉండ్రాజవరం, మార్చి 1: గ్రామాల్లో అభివృద్ధి పనులకు ప్రాధాన్యమిస్తున్నట్టు ఎమ్మెల్యే జి.శ్రీనివాసనాయుడు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని వేలివెన్ను గ్రామంలో మూడు రైతుభరోసా కేంద్రాలను, దమ్మెన్ను గ్రామంలో సచివాలయ భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమంతోపాటు అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు నందిగం బాస్కరరామయ్య, జిల్లా అగ్రిబోర్డు అడ్వయిజర్ కమిటి ఛైర్మన్ బూరుగుపల్లి సుబ్బారావు, ఇతర నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

వ్యాసరచనలో ప్రసన్నకు ప్రథమ స్థానం

రంగంపేట, మార్చి 1: ఆదికవి నన్నయ యూనివర్సిటీలో పీజీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న రంగంపేటకు చెందిన బర్లంకి ఎస్వీ ప్రసన్న అభివృద్ధి చెందిన భారతదేశం కోసం దేశీయ సాంకేతికతలు అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ప్రథమ బహుమతి సాధించింది. అలాగే జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో స్కిట్ ప్రదర్శనలో కూడా ప్రథమ బహుమతి సాధించింది. ఈ సందర్భంగా శుక్రవారం జరిగిన సభలో ఆచార్య పద్మరాజు, ముఖ్యతిథి వీవీఎస్ కృష్ణమూర్తి చేతులమీదుగా సర్టిఫికెట్, జ్ఞాపికను అందుకుంది.

ప్రశాంతంగా ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు

- 3 జిల్లాల్లో 2,550 మంది గైర్హాజరు
- పలు చోట్ల అసౌకర్యాలతో విద్యార్థుల ఇక్కట్లు

రాజమహేంద్రవరం, మార్చి 1(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. తొలి రోజున మొదటి ఏడాది తెలుగు, సంస్కృతం, హిందీ పరీక్ష కావడంతో విద్యార్థులు కాస్త టెన్షన్ ఫ్రీగా కనిపించారు. ఉదయం 9గంటలకు పరీక్ష ప్రారంభం కాగా.. గంట ముందుగానే చాలా మంది విద్యార్థులు పరీక్ష కేంద్రాల వద్దకు చేరుకున్నారు. విద్యార్థులను పూర్తిగా తనిఖీ చేసిన తర్వాత గదుల్లోకి అనుమతించారు. తూర్పుగోదావరి, కాకినాడ, అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లో జనరల్ విభాగంలో 52,277 మంది విద్యార్థులకు 50,411 మంది.. ఒకేషనల్‌లో 6,889కి 6,205 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. గ్రామాల నుంచి వచ్చే విద్యార్థులు సమయానికి బస్సులు అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆటోలను ఆశ్రయించి పరీక్ష కేంద్రాల వద్దకు చేరుకున్నారు. ఈ క్రమంలో ఉరుకులు పరుగులు తప్పలేదు. ప్రైవేటు కళాశాలలు విద్యార్థులు కళాశాలకు వస్తే అక్కడి నుంచి పరీక్ష కేంద్రానికి.. పరీక్ష ముగిసిన తర్వాత కళాశాలకు బస్సు సదుపాయం కల్పించకపోవడంతో విద్యార్థులకు ఇళ్లకు వెళ్లడానికి అవస్థలు తప్పలేదు. కొన్ని పరీక్షా కేంద్రాల్లోని గదుల్లో సీలింగ్ ఫ్యాన్లు పని చేయకపోవడంతో మూడు గంటలపాటు పరీక్ష రాసే క్రమంలో విద్యార్థులు అసౌకర్యానికి గురయ్యారు. అయితే, కిటికీలు తెరుచుకోవాలని అభ్యర్థులకు సిబ్బంది సలహా ఇచ్చారు. విద్యార్థులను పరీక్షా కేంద్రాలకు తీసుకొచ్చిన తల్లిదండ్రులు చాలామంది వేచి చూడడానికి నీడ దొరక్క ఇబ్బంది పడ్డారు. మూడు గంటలపాటు వేచి ఉండే క్రమంలో ఎండ వేడిమికి ముఖ్యంగా మహిళలు, వృద్ధులు తీవ్రంగా అసౌకర్యానికి గురయ్యారు. తాగునీరు, మరుగుదొడ్లు సమస్యగా మారాయి. తూర్పుగోదావరి జిల్లాలో జనరల్ విభాగంలో 19,737 మందికి 19,309.. ఒకేషనల్ విభాగంలో 2,001కి 1,851 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకోలేదని ఇంటర్మీడియట్ విద్యా మండలి అధికారులు పేర్కొన్నారు. కాగా.. శనివారం(2న) రెండో ఏడాది జనరల్ విద్యార్థులకు ద్వితీయ భాష, ఒకేషనల్‌కి జనరల్ ఫౌండేషన్ కోర్సు పరీక్షలు జరుగుతాయి.

వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో ఇద్దరికి కాంస్య పతకాలు



పతక విజేతలతో వీసీ పద్మరాజు, రిజిస్ట్రార్ తదితరులు

దివాన్‌చెరువు, మార్చి 1: తమ విద్యార్థులు అఖిల భారత, ఖేలో ఇండియా విశ్వవిద్యాలయ క్రీడల్లో ప్రతిభ కనబరచి రెండు కాంస్య పతకాలను సాధించారని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు తెలిపారు. వర్సిటీలో శుక్రవారం అభినందన సభలో ఆయన మాట్లాడుతూ నన్నయ యూనివర్సిటీ అనుబంధ కళాశాలైన డీఆర్‌కే రెడ్డి వ్యాయామ విద్య కళాశాల(గొల్లలమామిడాడ)లో డిప్లమా ఇన్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రథమ సంవత్సరం చదువుతున్న బైరెడ్డి రాజేశ్వరి అఖిల భారత వెయిట్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ 45 కిలోల కేటగిరిలోనూ, ఖేలో ఇండియా పోటీల్లో 49 కిలోల కేటగిరిలో బైరెడ్డి చంద్రిక కాంస్య పతకాలను సాధించారన్నారు. వీరిద్దరూ భవిష్యత్‌లో మరిన్ని పతకాలు గెలుచుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, ప్రిన్సిపాల్ కె.సుబ్బారావు, క్రీడాబోర్డు కార్యదర్శి బి.రామ్‌గోపాల్, పీడీ బి.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

సహాయాచార్యుడు సాంబశివరావుకు పీహెచ్‌డీ ప్రదానం



దివాన్‌చెరువు, మార్చి1: కుప్పంలోని ద్రవిడ విశ్వవిద్యాలయం నుంచి పీహెచ్‌డీ పొందిన ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం విద్యా కళాశాల సహాయాచార్యుడు ఆర్.సాంబశివరావును ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు శుక్రవారం అభినందించారు. ద్రవిడ వర్సిటీ విద్యాశాఖ ఆచార్యుడు ఎల్.కె.ఎం. బాబూరావుచౌదరి పర్యవేక్షణలో తూర్పుగోదావరి జిల్లాలోని ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయుల బోధనా సామర్థ్యంపై ఒత్తిడి, ప్రభావం అనే అంశంపై చేసిన పరిశోధనకు సాంబశివరావుకు ద్రవిడ వర్సిటీ పీహెచ్‌డీ ప్రదానం చేసిందని తెలిపారు. ఈ ధ్రువపత్రాన్ని వీసీ పద్మరాజు ఆయనకు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఏపీ తెలుగు సంస్కృత అకాడమీ ముద్రించిన డీఎస్సీ స్కూల్ అసిస్టెంట్-గణితశాస్త్రం పుస్తక రచయితల్లో ఒకరైన సాంబశివరావును అభినందించి ఆ పుస్తకాన్ని వీసీ విడుదల చేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, ఈసీ సభ్యులు పి.విజయనిర్మల, కె.నూకరత్నం, పి.సురేష్‌వర్మ, అధ్యాపకులు కేఎస్ రమేష్, బి.జగన్మోహనరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ ఎగవేతపై తనిఖీలు



తనిఖీ చేస్తున్న విజిలెన్స్ ఎస్పీ సుబ్బారెడ్డి

రాజమహేంద్రవరం, మార్చి 1(ఆంధ్రజ్యోతి): దుకాణాల యజమానులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం జీఎస్టీ చెల్లించకుండా ఎగవేసినా, హోటళ్ల తదితర వ్యాపారులు వాణిజ్య అవసరాలకు గృహ వినియోగ గ్యాస్ సిలిండర్లు వాడినా కఠిన చర్యలు తప్పవని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ కేవీఎస్‌వీ సుబ్బారెడ్డి హెచ్చరించారు. రాజమహేంద్రవరంలోని నగరంలోని రాజ్‌గురు స్టోర్స్‌లో తనిఖీలు చేశామన్నారు. నాలుగు ప్రదేశాల్లో రూ.1,52,41,352 విలువైన 10,805 వస్తువులకు సంబంధించి స్టాక్ వెరిఫికేషన్ చేశామన్నారు. స్టాక్, కొనుగోలు, విక్రయ రిజిస్టర్లు నిర్వహించకపోవడం గుర్తించామని చెప్పారు. పన్ను ఎగవేతపై పరిశీలనకు బిల్లు పుస్తకాలు, ఇన్వాయిస్ ఫైల్స్ స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ తెలిపారు. కొన్ని వస్తువులకు సంబంధించి వినియోగదారులు, తయారీదారుల వివరాలు, తప్పనిసరి డిక్లరేషన్ లేకపోవడంతో 5 కేసులు నమోదు చేశామన్నారు. అలాగే.. నిడదవోలు మండలంలోని గోపవరంలో టీ-కేఫ్ హోటల్‌లో తనిఖీలు చేయగా వాణిజ్య అవసరాలకు వాడుతున్న ఐదు గృహ వినియోగ సిలిండర్లను గుర్తించి స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామన్నారు. తనిఖీల్లో డీఎస్పీ ముత్యాలనాయుడు, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరెడ్డి, ఏవో భార్గవ మహేశ్, లక్ష్మీనారాయణ, లీగల్ మెట్రాలజీ, కమర్షియల్ ట్యాక్స్, రెవెన్యూ, పౌర సరఫరాల శాఖ అధికారులు పాల్గొన్నారు.